
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
గురువారం 18 జూలై 2024



▶ క్లాప్ వాహనాల డ్రైవర్ల సమ్మె
నగరంలో నిలిచిన ఇంటింటి చెత్త సేకరణ
▶ ముక్కలై తీరానికి కొట్టుకొచ్చిన బోటు
ప్రాణాలతో బయటపడ్డ మత్స్యకారులు
▶ ఎంవీవీ అపార్టుమెంట్
రహదారి కోసం చెరువు ఆక్రమణ
» రెవెన్యూ నిర్ధారణ
.. వివరాలు Iలో

పార్కులపై పెద్దల కన్ను

ఈస్ట్ పాయింట్ కాలనీలోని రెండింటిని యుఎల్‌సీ భూముల పేరుతో కొట్టేసేందుకు యత్నం

- చక్రం తిప్పుతున్న యూఎల్‌సీ దళారి
- సాయిబాబా ఆలయం నిర్వహణలో లేవని పత్రం తీసుకున్నట్టు వినికిడి
- 2,000 గజాలు...విలువ రూ.50 కోట్లుపైనే
- ఆ రెండు పార్కులు ఉన్న స్థలం దశాబ్దాల కిందటే జీవీఎంసీకి దఖలు



ఈస్ట్ పాయింట్ కాలనీలో జీవీఎంసీకి దఖలు పడిన పార్కు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

నగరంలోని ఈస్ట్ పాయింట్ కాలనీలో జీవీఎంసీకి చెందిన రెండు పార్కులను కొట్టేసేందుకు పలువురు పావులు కదుపుతున్నారు. ఈ రెండు పార్కులు రెండు దశాబ్దాలుగా సమీపంలోని సాయిబాబా ఆలయ నిర్వహణలో ఉన్నాయి. ఇప్పుడు ఆ పార్కులు తమ ఆధీనంలో లేవని ఆలయ కమిటీ వద్ద లేఖ తీసుకొని సుమారు రూ.50 కోట్ల విలువైన పార్కుల భూములు చేజిక్కించుకునేందుకు కొందరు యత్నిస్తున్నారు. దసపల్లా భూములలో ఎవరైతే కీలకంగా వ్యవహరించి వాటిని చేజిక్కించుకున్నారో అదే 'యుఎల్‌సీ దళారి' ఇప్పుడు ఈ పార్కులపై కన్నేశారు.



మరో పార్కు

అవి జమీందార్ల మిగులు భూములు

ఈస్ట్ పాయింట్ కాలనీలో గంగాపూర్ జమీందార్లకు భూములు ఉండేవి. పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టం (అర్బన్ ల్యాండ్ సీలింగ్) అమలులోకి వచ్చిన తరుణంలో వాటిని వారు వదులుకున్నారు. అప్పటికే వాటిలో కొందరు ఆక్రమణదారులు ఉండడంతో వాటిని యుఎల్‌సీ కింద క్లెయిమ్ చేయలేదు. ఆ తరువాత ఆ భూములు చేతులు మారాయి. ఆంధ్రా యూనివర్సిటీ ఉద్యోగులు వాటిని కొనుగోలు చేసి లేఅవుట్ వేసి ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే ఆ లేఅవుట్‌కు ఎటువంటి అనుమతులు లేవు. లేఅవుట్‌ను ప్లాట్లుగా విభజించినప్పుడు సామాజిక అవసరాలు...పార్కులకని కొంత, పాఠశాలకని కొంత భూమి విడిచిపెట్టారు. అలా ఖాళీగా ఉన్న భూమిలో కేడీపీఎం పాఠశాల ఏర్పాటుచేశారు. సాయిబాబా గుడికి ఎడమ వైపు రహదారిని ఆనుకొని ఉన్న రెండు ఖాళీ స్థలాలను పార్కులుగా మార్చారు. ఈ క్రమంలో అవి జీవీఎంసీకి దఖలు పడ్డాయి. నగరంలోని పార్కులన్నీ జీవీఎంసీ నిర్వహణలో ఉండడంతో అవి కూడా ఆ జాబితాలో చేరాయి. ఈస్ట్ పాయింట్ సాయిబాబా ఆలయ నిర్వాహకులు తమకు ఆ పార్కులు అప్పగిస్తే పూజలకు అవసరమైన మొక్కలు పెంచుకుంటామని, చావిడి ఏర్పాటు చేసుకుంటామని కోరడంతో నిర్వహణ భారం తగ్గుతుందని జీవీఎంసీ అధికారులు అంగీకరించారు. ఆ పార్కులు గత రెండు దశాబ్దాలుగా ఆలయ కమిటీ నిర్వహణలోనే నడుస్తున్నాయి. ఆలయ కమిటీ నుంచి విడిపోయిన ఓ వ్యక్తి ఆ పార్కులను తన చేతిలోకి తీసుకున్నారు. ఒక పార్కును గేదెల పెంపకానికి అద్దెకు ఇచ్చారు. ఈ వ్యవహారాలన్నీ బయటకు కనిపించకుండా పార్కు ప్రహరీని ఆరు అడుగుల ఎత్తున నిర్మించారు. గేదెల పెంపకం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేయడంతో జీవీఎంసీ అధికారులు వాటిని అక్కడి నుంచి పంపించేశారు. ఆ తరువాత కమిటీలోని వ్యక్తి ఆ పార్కులోనే స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని రెండు పార్కులను తన స్వాధీనంలోనే నిర్వహిస్తున్నారు. పచ్చగా ... మిగతా 6వ పేజీలో

ఆ తవ్వకాలకు వైసీపీ దన్ను?

▶ ఎర్రమట్టి దిబ్బల వద్ద తాత్కాలిక లేఅవుట్‌కు 2023లోనే అనుమతి

- పది రోజుల క్రితం సరైన పత్రాలు సమర్పించాలని జీవీఎంసీ నోటీసు
- పట్టించుకోని కో-ఆపరేటివ్ సొసైటీ ప్రతినిధులు
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన అధికారులు
- సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ సస్పెన్షన్
- వీఆర్‌ఓ, ఆర్‌ఐలకు షోకాజ్ నోటీసులు



యథేచ్ఛగా తవ్వేసిన ఎర్ర మట్టిదిబ్బలు (ఇన్‌సెట్‌లో) గురువారం ఎర్రమట్టి దిబ్బలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

విశాఖపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి):

భీమిలి మండలం నేరెళ్లవలసలో భౌగోళిక వారసత్వ సంపదగా వచ్చిన ఎర్రమట్టి దిబ్బలను పెద్దఎత్తున తవ్వడం వెనుక వైసీపీ పెద్దల హస్తం ఉందనే విషయం బట్టబయలైంది. ఎర్రమట్టి దిబ్బలకు ఎసరు పెట్టారని, కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ లేఅవుట్ పేరుతో భారీగా మట్టిని తవ్వేస్తున్నారని బుధవారం 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించడంతో సీఎంఓ స్పందించింది. కలెక్టర్ ఆదేశం మేరకు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ క్షేత్ర పరిశీలనకు వెళ్లారు. రికార్డులను పరిశీలించారు. ఈ భూముల కేటాయింపు, అనుమతులపై ఓ ప్రకటన విడుదల చేశారు.

నేరెళ్లవలస సర్వే నంబరు 118లో భీమిలి కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి 373.95 ఎకరాలను 1979లో ప్రభుత్వం కేటాయించింది. ఈ భూముల వివాదం సుప్రీంకోర్టు వరకు వెళ్లడంతో 2014లో అధికారికంగా సొసైటీకి జిల్లా అధికారులు అప్పగించింది. ఆ తరువాత జరిగిన సర్వేలో ఆ భూముల్లో 91.5 ఎకరాలు జియో హెరిటేజ్‌కు చెందినవిగా గుర్తించడంతో వాటిని మినహాయించి మిగిలిన 280.7 ఎకరాలను 2016 జూలై 12న సొసైటీకి ఇచ్చారు. ఈ భూమిలో లేఅవుట్ వేస్తామని సొసైటీ ప్రతినిధులు 1086/0014/ఎల్‌పీ/జెడ్1/2022లో జీవీఎంసీకి దరఖాస్తు చేశారు. దానిని అధికారులు పక్కనపెట్టగా వైసీపీ నేతలు ఒత్తిడి తెచ్చి 2023 ఏప్రిల్ 10న (118/5ఏ నంబరు) తాత్కాలిక లేఅవుట్‌కు అనుమతి ఇప్పించారు. అయితే సొసైటీ భూమిలో 242.472 ఎకరాల్లో మాత్రమే లేఅవుట్ వేయాలని జీవీఎంసీ అధికారులు స్పష్టంచేశారు. ఆ తరువాత దరఖాస్తును మరింత లోతుగా పరిశీలించగా పలు పత్రాలను సమర్పించలేదని గుర్తించారు. వెంటనే వాటిని అందజేయాలని సూచిస్తూ 2023 మే 12న షార్ట్ ఫాల్ నోటీసు ఇచ్చారు. అయితే వైసీపీ నేతలు అండగా నిలవడంతో సొసైటీ ప్రతినిధులు ఈ నోటీసును పట్టించుకోలేదు. వందల ఎకరాల్లో ఎర్రమట్టి దిబ్బలను తవ్వేసి ఆ ప్రాంతం అంతా చదును చేయడం ప్రారంభించారు. వైసీపీ పాలన కావడంతో ఎవరూ దీనిపై నోరెత్తలేదు. ఆపే సాహసం చేయలేదు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పాటైనా కూడా సొసైటీ ప్రతినిధులు పనులు కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ విషయం పర్యావరణవేత్తల ద్వారా తెలుసుకున్న జీవీఎంసీ అధికారులు ఈ నెల 8వ తేదీన మరోసారి షార్ట్ ఫాల్ నోటీసు జారీచేశారు. దానికి కూడా సొసైటీ ప్రతినిధులు స్పందించలేదు...సరికదా మట్టి తవ్వకాలు ఇంకా ఉధృతం చేశారు. ఈ విషయం 'ఆంధ్రజ్యోతి' దృష్టికి రావడంతో బుధవారం వెలుగులోకి తెచ్చింది. ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించింది. జాయింట్ కలెక్టర్ వెళ్లి పరిశీలించారు. జేసీబీలు, పొక్లెయిన్లతో పనులు జరుగుతుంటే ఎందుకు చర్యలు తీసుకోలేదంటూ మండలాధికారులను ప్రశ్నించారు. దీనికి సంజాయిషీ ఇవ్వాలంటూ ... మిగతా 6వ పేజీలో

మళ్లీ టోల్‌గేట్!?

అగనంపూడి వద్ద తొలగించిన టోల్‌గేట్‌ను పునరుద్ధరించేందుకు సిద్ధమవుతున్న నేషనల్ హైవే అథారిటీ

- టోల్ వసూళ్లకు టెండర్లు ఆహ్వానం
- ఏడాదికి రూ.81 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా
- స్థానికుల ఆగ్రహం



స్థానికులు, కూటమి కార్యకర్తలు టోల్‌ప్లాజాను తొలగించడంతో ప్రస్తుతం ఇలా..

విశాఖపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి):

అగనంపూడి వద్ద టోల్‌గేట్‌ను మళ్లీ ప్రారంభించేందుకు నేషనల్ హైవే అథారిటీ (ఎన్‌హెచ్‌ఏ) అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ టోల్‌గేట్‌ను తొలగించాలంటూ కొద్దిరోజుల కిందట స్థానికులు, కూటమి కార్యకర్తలు ఆందోళనకు దిగారు. మరుసటిరోజు రాత్రి టోల్‌ప్లాజాను పూర్తిగా తొలగించారు. అప్పటి నుంచి అక్కడ టోల్‌గేట్ లేదు. నేషనల్ హైవే అథారిటీ అధికారులు ఈ వ్యవహారంపై నగర పోలీస్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు కూడా చేశారు. కానీ, సున్నితమైన వ్యవహారం కావడంతో పోలీసులు కూడా ఎటువంటి చర్యలు తీసుకోలేకపోయారు. దీంతో టోల్‌గేట్ బెడద తొలగిపోయిందంటూ స్థానికులు ఆనందం వ్యక్తంచేశారు. అయితే, ఈ టోల్‌గేట్‌ను మళ్లీ పెట్టేందుకు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. టోల్ వసూలుకు టెండర్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈనెల పదో తేదీన కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల సంస్థ పరిధిలోని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ప్రకారం అగనంపూడి టోల్‌గేట్ ద్వారా ఏడాదికి రూ.81 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేసిన ఎన్‌హెచ్‌ఏఐ.. అందుకు అనుగుణంగా టెండర్లను ఆహ్వానించింది. అక్కడ వసూలుచేసే ఫీజులకు సంబంధించిన వివరాలను టెండర్ నోటిఫికేషన్‌లో వెల్లడించింది. కారు, జీపు, వ్యాన్, లైట్ మోటార్ వెహికల్‌కు వన్ వే ట్రిప్‌నకు రూ.65, రెండు వైపులా అయితే రూ.95, ఈ వాహనాలు నెలలో 50సార్లు ప్రయాణించేందుకు ... మిగతా 6వ పేజీలో



ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని ఆక్రమించి ఇంటి గోడను నిర్మించిన కార్పొరేటర్ గోవిందరెడ్డి

పాఠశాల స్థలం ఆక్రమించారు

- కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డిపై పోలీసులకు ఎంఈవో ఫిర్యాదు

గాజువాక, జూలై 17:

జీవీఎంసీ 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి తుంగ్లాం ప్రాథమిక పాఠశాలకు చెందిన స్థలాన్ని ఆక్రమించారని గాజువాక పోలీసులకు ఎంఈవో విశ్వనాథం బుధవారం ఫిర్యాదు చేశారు. పాఠశాల స్థలాన్ని కార్పొరేటర్ ఆక్రమించి తన ఇంటికి గేటు ఏర్పాటు చేసుకున్నారని గ్రామ ప్రజలు ఇటీవల జిల్లా విద్యాశాఖాధికారిణికి ఫిర్యాదు చేశారు. ఆమె ఆదేశాల మేరకు ఎంఈవో స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వ పాఠశాల స్థలం ఆక్రమణపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

నేరాల నియంత్రణకు టెక్నాలజీ వినియోగం

విధి నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా పోలీసులను తీర్చిదిద్దుతాం

- స్టేషన్ స్థాయిలోనే న్యాయం జరిగేలా చేయడమే ప్రథమ కర్తవ్యం
- గంజాయి సాగు, రవాణాను కట్టడి చేస్తాం
- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి




బాధ్యతలు స్వీకరిస్తున్న డీఐజీ గోపీనాథ్ జట్టి

విశాఖపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి):

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటానని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి అన్నారు. డీఐజీగా బుధవారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విలేకరులతో గోపీనాథ్ మాట్లాడుతూ గతానికి భిన్నంగా ప్రస్తుతం అన్ని రంగాలకు అనుగుణంగా టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందని పేర్కొంటూ, పోలీసులు తమ విధి నిర్వహణలో సాంకేతికతను అందిపుచ్చుకునేలా తీర్చిదిద్దుతామన్నారు. సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, ఎక్కువగా చదువుకున్నవారే నేరగాళ్ల వలలో చిక్కుకుంటున్నారన్నారు. సైబర్ నేరాలు, ఇతర నేరాల అదుపునకు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకునేలా నిపుణులతో పోలీసులకు శిక్షణ ఇప్పిస్తామన్నారు. అవసరమైన మౌలిక వసతులు సమకూర్చుకుంటామన్నారు. సోషల్ మీడియా వినియోగంలో ప్రజలు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుని ప్రాథమిక పోలీసింగ్ అమలు జరిగే విధంగా కృషిచేస్తానని గోపీనాథ్ జట్టి అన్నారు. పోలీస్ స్టేషన్ స్థాయిలోనే అందరికీ న్యాయం జరిగేలా చేయడమే ప్రథమ కర్తవ్యమని తెలిపారు. కేంద్రం అమలుచేసే కొత్త చట్టాలపై ప్రజలకు అవగాహన ... మిగతా 6వ పేజీలో

శేషపాన్పుపై జగన్నాథుడు



టర్నర్ చౌల్ట్రీలో కొనసాగుతున్న ఉత్సవాల్లో భాగంగా జగన్నాథస్వామి బుధవారం శేష శయునిగా దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం తొలి ఏకాదశి కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం తిరుగు రథయాత్ర జరగనుంది.

భక్తి శ్రద్ధలతో మొహర్రం



నగరంలోని ముస్లింలు బుధవారం మొహర్రంను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మసీదు కమిటీల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీలు నిర్వహించారు. కాగా పలువురు ముస్లింలు మాతమ్ నిర్వహించారు.

అమ్మో.. టమాటా!!

- రైతుబజారులో కిలో రూ.67
- బయట మార్కెట్‌లో రూ.100



విశాఖపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి):

నగరంలో టమాటా రేటు భారీగా పెరిగిపోయింది. వారం క్రితం కిలో రూ.40 ఉండగా..బుధవారం ఒక్కసారిగా రూ.67కి చేరింది. అంత రేటు పెట్టి కొందామన్నా రైతుబజార్లలో సరకు లేదు. బయట మార్కెట్‌లో కిలో రూ.100 చెబుతున్నారు. పంట లేకపోవడం, మదనపల్లి మార్కెట్‌కు తక్కువ మొత్తంలో టమాటా రావడం వల్ల ధర పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. నిత్యావసర సరకుల ధరలు తగ్గించేందుకు కందిపప్పు, బియ్యం ఎలాగైతే రాయితీ ధరకు రైతుబజార్లలో విక్రయిస్తున్నారో, టమాటాను కూడా అలాగే అమ్మాలని కొనుగోలుదారులు కోరుతున్నారు.



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



డాగ్ స్క్వాడ్‌తో పర్యవేక్షిస్తున్న పోలీసులు

సీతమ్మధార, జూలై 17: నగర సీపీ శంఖబ్రత బాగ్చీ ఆదేశాలతో బుధవారం రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా నియంత్రణలో భాగంగా ఎస్ఈబీ సీఐ టి.వెంకట అప్పలనాయుడు, సీహెచ్.రాజులునాయుడు ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ ఎస్. మురళినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్సిటీల్లో పోస్టుల భర్తీపై హర్షం

అక్కయ్యపాలెం, జూలై 17: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లో న్యాయపరమైన సమస్యలను తొలగించి 3,220 ఉద్యోగాల భర్తీ కి విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ చర్యలు తీసుకోవడంపై ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ హర్షం వ్యక్తం చేశారు. అలాగే, గతేడాది ఆగిపోయిన కానిస్టేబుల్స్ ఎంపిక ప్రకియలో అభ్యర్థులకు గ్రేస్ మార్కులు వేసి భర్తీ చేయాలని కోరారు. అన్ని విశ్వవిద్యాలయాల్లో రెగ్యులర్ వీసీలను నియమించాలని కోరారు.



వైశాఖి జల ఉద్యాన వనం వద్ద నమాజ్‌లో ముస్లింలు



మర్రిపాలెంలో ప్రార్థనలు

భక్తి శ్రద్ధలతో మొహర్రం

» వైశాఖీ జలఉద్యాన ప్రాంగణానికి తరలివచ్చిన ముస్లిం కుటుంబాలు » నమాజ్‌లు, ప్రార్థనలు

జగదాంబ కూడలి, జూలై 17: ముస్లింలు భక్తిశ్రద్ధలతో మొహర్రంను బుధవారం జరిపారు. నగరంలోని పలు మసీదుల నుంచి కుటుంబాలతో భారీ సంఖ్యలో వన్‌టౌన్‌లోని వైశాఖి జల ఉద్యానవన ప్రాంగణంలోని పీర్ల కోనేరు వద్దకు వచ్చారు. మతాచారం ప్రకారం అల్లాకు నమాజ్ జరిపారు. మొక్కులు చెల్లించుకున్నారు. నగరంలో 60,70 ఏళ్లకు పైగా ఇక్కడ పీర్ల పండగ ఆచారం కొనసాగుతోంది. అయితే, గతంలో వైశాఖి జల ఉద్యాన వనం వద్ద కోనేరు ఉండేది. ఏటా వన్‌టౌన్ పరిసరాల్లోని ముస్లింలు వచ్చి నమాజ్ చేసేవారు. ప్రస్తుతం కోనేరు అంతరించిపోవడం తో మత పెద్దల ఆచారం ప్రకారం సూపర్‌బజారు మార్గంలో ఉన్న కోనేరు, చెట్ల వద్దకు కుటుంబాలతో వచ్చి పీర్ల పండగ రోజున అల్లాకు భక్తితోపూజలు జరుపుతారు. ఈ నేపథ్యంలో టర్నర్ చౌల్ట్రీ నుంచి నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం వరకు భారీ సంఖ్యలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనరాకపోకలను నియంత్రిం చారు. వేల సంఖ్యలో ముస్లింలు పీర్ల కోనేరువద్ద ప్రార్థనల్లో పాల్గొన్నారు. మతాచారం ప్రకారం షర్బత్, బిర్యానీ ప్యాకెట్లు పంచిపెట్టారు. సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నమాజ్‌లు కొనసాగాయి.

మర్రిపాలెం: మర్రిపాలెం జాకీర్‌హుస్సేన్ నగర్‌లోని మజీద్ ఈ అల్ ఖదీర్ ఆధ్వర్యంలో బుధవారం మసీద్ ప్రాంగణంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం మతగురువు తఖీర్ర్ పఠించారు. అనంతరం మసీద్ కమిటీ అధ్వర్యంలో తయారు చేసిన ప్రత్యేక పానీయాన్ని ముస్లింలకు అందజేశారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే మొహర్రం రోజున ఏటా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామని కమిటీ అధ్యక్షుడు మున్నా తెలిపారు.

పారా అథ్లెటిక్స్‌లో ఆంధ్రాకు పతకాల పంట



పతకాలు సాధించిన క్రీడాకారులు

విశాఖపట్నం (స్పోర్ట్స్), జూలై 17: జాతీయ సబ్ జూనియర్, జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మీట్‌లో ఆంధ్ర అథ్లెట్లు తొలిరోజు పతకాల పంట పండించారు. బెంగళూరులో జరుగుతున్న ఈ టోర్నీలో అద్భుతంగా రాణించి 18 పతకాలు సొంతం చేసుకున్నారు. వీటిలో ఐదు స్వర్ణ, ఐదు రజత, ఎనిమిది కాంస్య పతకాలున్నట్టు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి వి.రామస్వామి తెలిపారు. షాట్‌పుట్‌లో బొర్రా అక్షయ అనురాధ, హెచ్‌యు. శివాని స్వర్ణ పతకాలు, మల్లెల సుదర్శన రజతం, డి.శ్రావణి రజతం, పంగి కరుణాకుమారి కాంస్య పతకం సాధించారు. 1500మీ. పరుగులో మందసాయి నిఖిల్ గౌతమి , కనక సునీల్ కాంస్య పతకాలు, జావెలిన్ త్రోలో సవర శంకరావు కాంస్యం సాధించారు. 100మీ. పరుగులో వి. రవన్ని, కొర్నా రవి స్వర్ణ పతకాలు, కె.తేజశ్రీ, బి. లక్ష్మణ రజత పతకాలు, ఎం.రోహిత్, ఎస్.పూర్ణ చంద్రరావు, జి.సూర్య రోహిత్ కాంస్య పతకాలు సాధించారు. ఈ అథ్లెట్లను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గొనుగుంట్ల కోటేశ్వరరావు, ఇతర ప్రతినిధులు అభినందించారు.

లలితాపీఠంలో భగవద్గీత పారాయణం

అక్కయ్యపాలెం, జూలై 17: ఆషాఢంలో తొలి ఏకాదశి సందర్భంగా లలితాపీఠంలో అమ్మవారికి బుధవారం సామూహిక భగవద్గీత పారాయణ జరిగింది. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి పూజలు చేయడంతో పాటు భగవద్గీత పఠించారు.



భగవద్గీత పఠనంలో మహిళలు

'ఏయూ వీసీగా దళితులకు అవకాశం ఇవ్వాలి'

సీతమ్మధార , జూలై 17: ఏయూ వీసీగా దళితులకు అవకా శం కల్పించాలని దళిత హక్కుల పోరాట సమితి అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ డిమాండ్ చేసింది. బుధవారం అంబేద్కర్ భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏయూ ప్రపంచ స్థాయి గుర్తింపు కలిగిన ఎందరో ప్రతిభావంతులను శాస్త్రవేత్తలను తీర్చిదిద్దిన ఘనత ఉందన్నారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ వంటి వారు ఏయూలో పనిచేశారన్నారు. గత వీసీ ప్రసాద్‌రెడ్డి ఆ స్థాయిని దిగజార్చారన్నారు. ఎంతో మంది అనర్హులను అనేక పదవుల్లో నియమించారని ఆరోపించారు. అర్హులైన వారినిత ఉద్యోగాల నుంచి తొలగించి వారిని వేధించినట్టు ఆరోపించారు. ఈస్థితిలో వర్సిటీలో సెర్చ్ కమిటీ వేయాలని, కొత్త పరిశోధనలను ప్రోత్సహించాలని కోరారు. ఇవేవీ చేపట్టకుండా ఆరేళ్లుగా వర్సిటీ స్థాయిని దిగజార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అత్యంత విద్యార్హతలు, సీనియర్లు, సమర్థత కలిగిన దళిత ప్రొఫెసర్లు ఉన్నారని తెలిపారు. వీరికే వీసీ పోస్టు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు ఎస్. రాజు, కార్యదర్శి జి. రాంబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేవీ ప్రభాకర్

విద్యా ప్రదాత ఆనందగజపతిరాజు

సింహాచలం, జూలై 17 : విజయనగర సంస్థానాధీశుడు, సింహాచలం దేవస్థానం పాలక మండలి మాజీ చైర్మన్ పూసపాటి ఆనందగజపతిరాజు విద్యా రంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి అన్నారు. ఆనంద గజపతిరాజు 75వ జయంతి పురస్కరించుకుని ఈఓ కార్యాలయంలో బుధవారం పలువురు ఆనందగజపతిరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఈఓ, దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు తదితరులు మాట్లా డుతూ ఆనందగజపతిరాజు చేసిన సామాజిక సేవలను గుర్తు చేశారు. అనంతరం పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాల విద్యార్థిని పూర్ణిమకు సుధా గజపతి, ఊర్మిళా గజపతి నగదు ప్రోత్సాహకం అందజేశారు.



విద్యార్థినికి నగదు ప్రోత్సాహం అందిస్తున్న సుధా గజపతిరాజు, తదితరులు

నేటి నుంచి టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమం

కంచరపాలెం, జూలై 17 : విశాఖ జిల్లాలోని ఎంఈవోలు,ప్రధానోపాధ్యాయులు,సీఆర్పీలకు గురువారం నుంచి పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో టీచ్ టూల్ బోధనపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు పేర్కొన్నారు.రెండో విడతలో శిక్షణ పొందని అధికారులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు 120 మంది ఈ శిక్షణను తీసుకోనున్నారు. ఈనెల 18వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమై 27వ తేదీతో ముగియనుందన్నారు. టీచ్ టూల్‌లో పొందిన శిక్షణ అనంతరం పాఠశాలల్లో వారు బోధనను పర్యవేక్షించాల్సి ఉంటుంది.

జీపీఎస్ నిలిపివేతపై ఎస్టీయూ హర్షం



సమావేశంలో ఎస్టీయూ నాయకులు

డాబాగార్డెన్స్, జూలై 17: దాదాపు నాలుగు లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు మేలు చేసే విధంగా జీపీఎస్ చట్టాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిలిపివేయడంపై ఎస్టీయూ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీపీఎస్‌ను పూర్తిగా రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, గత ఐదేళ్లుగా కోరుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో జీపీఎస్ రద్దు చేయడం అభినందించదగిన విషయమన్నారు. ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేసే వరకు తాత్కాలిక భృతి 30 శాతం వెంటనే ప్రకటించాలని కోరారు. విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ పాదయాత్రలో ప్రకటించిన 117 జీవోను రద్దు చేయాలనికోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పైలా దేముడుబాబు, రాష్ట్ర కార్యదర్శులు రామిరెడ్డి, పద్మావతి, కార్యదర్శి సునీత, ఉపాధ్యక్షులు ప్రభాకర్, కార్యదర్శి వరహాలదొర, గౌరవాధ్యక్షులు సన్యాసిరావు, అప్పలరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ సామగ్రి పంపిణీ

సీతమ్మధార, జూలై 16: సీతమ్మధార బాలయ్య శాస్త్రి లే అవుట్‌లో గల పాపాహోమ్ విద్యార్థులకు నేషనల్ హ్యూమన్‌రైట్స్ ఆధ్వర్యంలో స్టేషనరీ సామగ్రితో పాటు స్వీట్స్ పంపిణీ చేశారు. విద్యార్థులంతా చదువు పట్ల శ్రద్ధ చూపాలని ఈసందర్భంగా హ్యూమన్‌రైట్స్ ప్రతినిధి డాక్టర్ విజయ్ మోహన్ కోరారు. క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక ప్రతినిధులు కన్నబాబు, నరసింహరావు, ఫాతిమా బేగం పాల్గొన్నారు.



స్టేషనరీ అందజేస్తున్న నేషనల్ హ్యూమన్‌రైట్స్ ప్రతినిధులు

మూర్ఛ వ్యాధితో యువకుడి మృతి

కూర్మన్నపాలెం, జూలై 17: మూర్ఛ వ్యాధితో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ సమీపంలోని సురాయ్‌పూర్‌కు చెందిన గణేశ్‌కుమార్ విశ్వకర్మ (23) నెల రోజుల క్రితం బతుకు తెరువు నిమిత్తం వచ్చి అగనంపూడి గల్లవానిపాలెంలో అన్నపూర్ణ ఆటోమొబైల్స్ వాషింగ్ సెంటర్‌లో పనిలో చేరాడు. బుధవారం రాత్రి బైక్‌కు వాషింగ్ చేస్తుండగా మూర్ఛ వ్యాధి వచ్చి వెనక్కి పడిపోయాడు. వెంటనే గణేశ్‌కుమార్ విశ్వకర్మ స్నేహితులు అగనంపూడి ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకువెళ్లగా, పరీక్షించిన వైద్యులు గుండెపోటు రావడంతో మృతి చెందినట్టు నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఏసీపీ త్రినాథ్, సీఐ ఎర్రంనాయుడు ఆస్పత్రికి చేరుకుని మృతుని వివరాలను తెలుసుకున్నారు.

వలసదారులకు బియ్యం పంపిణీలో ఇబ్బందులు

డీఎస్‌వో జోక్యంతో తాత్కాలికంగా సమసిన సమస్య

విశాఖపట్నం, జూలై 17(ఆంధ్రజ్యోతి): నగరానికి ఉపాధి నిమిత్తం తాత్కాలికంగా వలసవచ్చిన కుటుంబాలకు రేషన్ బియ్యం పంపిణీలో వివక్షత చూపుతున్నట్టు ఆరోపణలున్నాయి. వన్‌రేషన్- వన్ నేషన్ కింద దేశంలో ఏ ప్రాంతానికి చెందిన వారైనా ఎక్కడైనా రేషన్ తీసుకునే వెసులబాటు ఉంది. అయితే, నగరలో మధురవాడ, ఆరిలోవ, పెందుర్తి, గాజువాక, ఇసుకతోట ప్రాంతాల్లో ఉంటున్న వలసకుటుంబాలకు రేషన్ కార్డులపై బియ్యం అందజేతలో జాప్యమవుతోంది. తొలుత స్థానికంగా ఉండే కుటుంబాలకు బియ్యం పంపిణీకి డీలర్లు మొగ్గుచూపుతున్నారు. తరువాత డిపోల్లో బియ్యం ఉంటేనే వలసదారులకు అందజేస్తున్నారు. సాధారణంగా వలసదారులు బియ్యం విడిపించి వినియోగానికి వాడుతారు. అదే నగరంలో చాలామంది విక్రయిస్తున్నారు. దీనివల్ల డీలరు/ఎండీయూలు స్థానికంగా ఉండే వారికే తొలుత బియ్యం ఇచ్చి తరువాత వలసదారులకు పంపిణీచేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నెలకు అదనపు కోటా అధికారులు ఇవ్వలేదు. ఫలితంగా మధురవాడ, ఆరిలోవ, ఇసుకతోట తదితర ప్రాంతాల్లో వలసదారుల్లో కొంతమందికి బియ్యం అందకపోవడంతో వారంతా ఆందోళన వ్యక్తంచేశారు. దీంతో జిల్లా పౌరసరఫరాల అధికారి సూర్యప్రకాశరావు స్పందించి జిల్లాలో డీలర్ల వద్ద మిగిలిన బియ్యం సమీకరించి ఎక్కడైతే అవసరమో ఆయా డిపోలకు పంపడంతో సమస్య తాత్కాలికంగా ముగిసింది. ఈనెలకు సంబంధించి బుధవారానికి 96.95శాతం కార్డుదారులకు బియ్యం పంపిణీ చేశారు.

సినీ సంగీత విభావరి రేపు

డాబాగార్డెన్స్, జూలై 17: భూషణ్‌బ్రదర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 19న డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలోని 'రాముని అవతారం రవికుల సోముని అవతారం' పేరిట సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్టు సీనియర్ కళాకారులు తెలిపారు.బుధవారం సాయంత్రం డాబాగార్డెన్స్‌లో ఈ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూషన్‌బ్రదర్స్ 32వ వార్షికోత్సవం పురస్కరించుకుని 19 తేదీ సాయంత్రం ఆరు గంటలకు పోర్టు సౌజన్యంతో ప్రముఖ గాయకులు ఫణిభూషణ్ ప్రత్యేక గీతాలాపన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భూషణ్‌బ్రదర్స్ కార్యదర్శి డి.భూపతి, ఎంవీఆర్ నాగేశ్వరరావు, నాటక కళాపరిషత్ నాంచారయ్య, వెంకట్, కృష్ణంరాజు, ఫణిభూషణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని పరిరక్షించాలి



ఎయిర్‌పోర్టు పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

మర్రిపాలెం, జూలై 17: ప్రకృతిని మనం కాపాడితే ప్రకృతి మనల్ని కాపాడుతుందని సామాజిక కార్యకర్త భూషణరావు అన్నారు. బుధ వారం ఎయిర్‌పోర్ట్ పోలీసు స్టేషన్ ఆవరణలో ఆయన పోలీసు సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనం హరించుకుపోవడంతో వాతావరణ కాలుష్యం విపరీతం పోతోందన్నారు. భవిష్యత్తు తరాలపై దీని ప్రభావం చూపకుండా ప్రతి ఒక్కరు బాధ్యతగా పచ్చదనం పెంపొందేంచేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రవిచంద్ర, ఉషా తదితరులు పాల్గొన్నారు.

గండి బాబ్జీకి అభినందనలు

సీతమ్మధార, జూలై 17: తెలుగుదేశం పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు గండి బాబ్జీని విశాఖ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుంటూరు నరసింహారావు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువతో సత్కరించారు.

బిల్డింగ్ సొసైటీ స్థలంలో పనుల నిలిపివేత

» తదుపరి ఆదేశాల వరకూ పనులన్నీ చేయొద్దు

» జాయింట్ కలెక్టర్ మయూర అశోక్

భీమునిపట్నం, జూలై 17 : బీచ్ రోడ్‌లో వున్న ది భీమునిపట్నం మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ స్థలంలో జరుగుతున్న పనులన్నీ తక్షణమే నిలిపివేయాలని జాయింట్ కలెక్టర్ మయూర అశోక్ ఆదేశించారు. బుధవారం ఆయన రెవెన్యూ, జీవీఎంసీ అధికారులతో కలిసి ఆ స్థలాన్ని పరిశీలించారు. స్థలంలో కొంతకాలంగా ఎర్రమట్టి దిబ్బలను చదును చేసి లేఅవుట్ వేస్తున్న పనులను పరిశీలించారు. ఆ స్థలంలో ఎర్రమట్టి దిబ్బలను ధ్వంసం చేసి చదును చేస్తున్న విషయాన్ని గమనించారు. వీటికి ఎవరు అనుమతులు ఇచ్చారని అధికారులను ప్రశ్నించగా ఎవరూ స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థలంలో జరుగుతున్న పనులన్నీ నిలిపివేయాలని ఆదేశించామన్నారు. దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయం సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించిందని, తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ సొసైటీ స్థలంలో ఏవిధమైన పనులు చేయరాదని చెప్పారు. దీనిపై రెవెన్యూ, జీవీఎంసీ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తుంటారని తెలిపారు. జేసీతో పాటు భీమిలి ఇన్‌ఛార్జి ఆర్డీవో హుస్సేన్, తహసీల్దార్ గోవింద, జీవీఎంసీ భీమిలి జోనల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, జనసేన నాయకుడు గుడివాడ కిరణ్, బీస్పీ నేత భాగం గోపాలరావు ఉన్నారు.

రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దాలి: కాంగ్రెస్

మాధవధార, జూలై 17 : ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి శ్రమిస్తున్న ముఖ్యమంత్రి నారా.చంద్రబాబు నాయుడు ప్రతి నిర్ణయం రాష్ట్ర భవిష్యత్తుకి ఉపకరించేలా తీసుకోవాలని కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూల.వెంకటరావు సూచించారు. ప్రయోగాలకు ఇది సమయం కాదని అన్నారు. మంత్రి వర్గంలో ప్రస్తుతం యువత, సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యం కల్పించడంతో కొంతమేర సమర్థత మరుగున పడిందన్నారు. పాలనానుభవం ఉన్న వారిని మంత్రి వర్గంలో మేలు చేకూరుతుందని వెంకటరావు అభి ప్రాయపడ్డారు.

పార్కులపై పెద్దల కన్ను

... 5వ పేజీ తరువాయి

మొక్కలతో కళకళలాడాల్సిన పార్కులలో సిమెంట్ నిర్మాణాలు చేపట్టి, నివాసానికి అనుగుణంగా ఇళ్లు కూడా నిర్మించారు. తాజాగా ఒక పార్కులో శివాలయం నిర్మించి పూజాదికాలు నిర్వహిస్తున్నారు.

ఇదిలావుండగా ఆ పార్కు భూములపై ఇప్పుడు 'యుఎల్‌సీ దళారి' కన్ను పడింది. రెండు పార్కులు కలిపి రెండు వేల చదరపు గజాల విస్తీర్ణంలో ఉంటాయి. బీచ్ రోడ్డును ఆనుకొనే ఉండడం, అంతా పోష్ ఏరియా కావడంతో అవి జమీందార్ల మిగులు భూములని క్లెయిన్ చేసి కొట్టేయడానికి పావులు కదుపుతున్నారు. అందులో భాగంగా సాయిబాబా ఆలయ కమిటీ నుంచి ఆ పార్కులకు, తమకు ఏ సంబంధం లేదని ఒక లేఖ కూడా తీసుకున్నారు. జీవీఎంసీ అధికారులను మేనేజ్ చేసి ఆ భూములను స్వాధీనం చేసుకోవాలని యత్నిస్తున్నారు. ఆ రెండు పార్కుల ముందు అవి జీవీఎంసీకి చెందినవని పెద్ద పెద్ద బోర్డులు ఉన్నా వెనక్కి తగ్గకుండా ప్రయత్నించడం గమనార్హం. ఆ లేఅవుట్‌కు అనుమతి లేనందున అందులో ఖాళీ స్థలాలు జీవీఎంసీకి దఖలుపడవని, అలాంటివి జమీందార్లకే చెందుతాయనే వాదనతో దస్త్రాలు తయారు చేస్తున్నట్టు తెలిసింది.దసపల్లా భూములను ఎలాగూ కాపాడుకోలేకపోయారు. కనీసం పార్కులనైనాఆ దళారి నుంచి కాపాడాల్సిన అవసరం ఉంది.

మళ్లీ టోల్‌గేట్!?

... 5వ పేజీ తరువాయి

రూ.2,155, జిల్లా స్థాయిలో రిజిస్టర్ అయిన కమర్షియల్ వాహనాలకు రూ.30 చొప్పున నిర్ణయించారు. అలాగే, లైట్ కమర్షియల్ వెహికల్, లైట్ గూడ్స్ వెహికల్, మినీ బస్సులకు ఒక ట్రిప్‌నకు రూ.105, రెండువైపులా అయితే రూ.155, నెలకు 50సార్లు ప్రయాణించేందుకు రూ.3,485, జిల్లా స్థాయిలో రిజిస్టర్ అయిన వాహనాలకు రూ.50 ఫీజుగా నిర్ణయించారు. అదేవిధంగా బస్సు, ట్రక్ వంటి వాహనాలు ఒక ట్రిప్‌నకు రూ.220, రిటర్న్ ట్రిప్‌నకు రూ.330, నెలకు 50సార్లు తిరిగేందుకు రూ.7,300, జిల్లా పరిధిలోని రిజిస్టర్ అయిన వాటికి రూ.110గా, కమర్షియల్ వాహనాలు (మూడు చక్రాలు) ఒక ట్రిప్‌నకు రూ.240, రిటర్న్ ట్రిప్‌కు రూ.360, నెలకు 50సార్లు ప్రయాణాలు సాగించేందుకు రూ.7,965, జిల్లా స్థాయిలో రిజిస్టర్ అయిన వాటికి రూ.120 చొప్పున వసూలు చేయనున్నారు. హెవీ కనస్ట్రక్షన్ మెషీన్లతో కూడిన వాహనాలతోపాటు ఇతర వాహనాలకు కొన్నిరకాల చార్జీలను నిర్ధారించి వసూలు చేసేలా టెండర్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. టెండర్లు వేసేందుకు ఈ నెల 24వ తేదీ ఉదయం 11 గంటలు తుదిగడువుగా పేర్కొంది. ఈ నెల 25వ తేదీ ఉదయం 11.30 గంటలకు టెండర్లు తెరవనున్నారు.

సీఎం దృష్టికి తీసుకువెళ్లిన నేషనల్ హైవే అధికారులు

అగనంపూడి టోల్‌గేట్ వ్యవహారాన్ని నేషనల్ హైవే అథారిటీ అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ టోల్‌గేట్ ద్వారా వచ్చే ఆదాయాన్ని రానున్న కాలంలో ఫ్లై ఓవర్లు, బస్, లారీ బేల నిర్మాణం, రోడ్డు మరమ్మతులు, నిర్వహణకు వినియోగిస్తామని చెప్పినట్టు తెలిసింది. అయితే, ఈ విషయంపై సీఎం ఎలా స్పందించారన్నది తెలియాల్సి ఉంది. ఇదిలావుండగా టోల్‌గేట్‌కు అధికారులు టెండర్లు ఆహ్వానించడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. దీనిపై మళ్లీ పోరాటం చేసేందుకు సిద్ధమని పేర్కొంటున్నారు.

దీనిపై స్థానిక ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ నేషనల్ హైవే అథారిటీ అధికారులు ఈ ప్రకటన చేయడం దారుణమన్నారు. ఇక్కడ టోల్‌గేట్ ఏర్పాటుచేస్తే ప్రజాగ్రహానికి గురికావాల్సి ఉంటుందన్నారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని టోల్‌గేట్ ఏర్పాటుపై అధికారులు పునరాలోచన చేయాలన్నారు. ఎన్‌హెచ్16కు బదులు ఎన్‌హెచ్ 5 అంటూ పేర్కొనడం ప్రజలను మోసం చేయడమేనన్నారు.

నేరాల నియంత్రణకు టెక్నాలజీ వినియోగం

... 5వ పేజీ తరువాయి

కల్పిస్తామన్నారు. నేరాల నియంత్రణకు 2014లో రాష్ట్రంలోనే తొలిసారిగా తిరుపతిలో కమాండ్ కంట్రోల్ ఏర్పాటుచేశామన్నారు. తిరుపతి ఎస్పీగా ఉన్నప్పుడు మహిళలు, బాలికలపై దాడులు, వేధింపుల నివారణకు 'షీ' టీమ్స్ ఏర్పాటుచేసిన విషయాన్ని గుర్తుచేశారు. మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామని డీఐజీ వెల్లడించారు. గంజాయి నిర్మూలనకు తగు చర్యలు తీసుకుంటామని, ప్రధానంగా పొరుగునున్న ఒడిశా పోలీసులతో కలిసి ప్రణాళిక అమలు చేస్తామన్నారు. గంజాయి, మత్తు పదార్థాల రవాణా నియంత్రణపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. గంజాయి సాగును నిరోధించేందుకు అన్నిరకాల సాయం అందించనున్నదని పేర్కొన్నారు. గతంలో మూడున్నరేళ్లు విశాఖ జిల్లాలో పనిచేయడంతో ఏజెన్సీలోని అన్ని ప్రాంతాలపై అవగాహన ఉందని...గంజాయి సాగు, రవాణా నియంత్రణపై కఠినంగా ఉంటామన్నారు. గతంలో మావోయిస్టుల కార్యకలాపాలు అణిచివేతకు పలు విభాగాలు ఏర్పాటుచేసి పెద్ద ఎత్తున కూంబింగ్, దాడులు చేసిన మాదిరిగా...ఇప్పుడు గంజాయి నిర్మూలనకు విభాగాలు ఏర్పాటుచేయాలన్నారు. ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటానని గోపినాథ్ జట్టి తెలిపారు. కాగా బాధ్యతలు స్వీకరించిన డీఐజీని సిటీ జాయింట్ సీపీ ఫకీరప్ప, అనకాపల్లి ఎస్పీ దీపికా పాటిల్, ఇతర అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు.

విశాఖ నుంచి ఉద్యోగ జీవితం ప్రారంభం

2008 బ్యాచ్‌కు చెందిన గోపినాథ్ జట్టి ఐపీఎస్ శిక్షణ పూర్తిచేసుకున్న తరువాత 2010లో విశాఖ జిల్లాలో ట్రైనీగా చేరారు. శిక్షణ తరువాత విశాఖలోనే గ్రేహౌండ్స్ అసిస్టెంట్ కమాండెంట్‌గా, తరువాత చింతపల్లి ఏఎస్పీగా పనిచేశారు. మొత్తం మూడున్నరేళ్లు విశాఖ జిల్లాలో పనిచేసి, 2013లో గుంటూరు ఏఎస్పీగా బదిలీపై వెళ్లి...అక్కడే ఎస్పీగా పదోన్నతి పొందారు. రాష్ట్ర విభజన అనంతరం తిరుపతి ఎస్పీగా, ఆ తరువాత మంగళగిరిలో ఆరో బెటాలియన్ కమాండెంట్‌గా, కర్నూలు ఎస్పీగా పనిచేసి 2018లో టీటీడీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా నియమితులై మూడున్నరేళ్లు పనిచేశారు. 2022లో పదోన్నతి రావడంతో గ్రేహౌండ్స్ డీఐజీగా పోస్టింగ్ పొందారు.

ఆ తవ్వకాలకు వైసీపీ దన్ను?

... 5వ పేజీ తరువాయి

నేరెళ్లవలస వీఆర్‌ఓకు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు ఆర్డీఓ ద్వారా నోటీసు ఇప్పించారు. తవ్వకాలపై నిర్లక్ష్యం వహించినట్టు తేలడంతో తోటవీధి సచివాలయం ప్లానింగ్ సెక్రటరీని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

అనుమతి లేకుండా షూటింగ్?

జాయింట్ కలెక్టర్ పర్యటనలో సర్వే నంబరు 96లో ప్రభుత్వ భూమి ఉండగా అక్కడ కూడా తవ్వకాలు జరిపి తాటి దుంగలతో ఓ నిర్మాణం చేపట్టిన విషయం గుర్తించారు. అక్కడ ఏదో సినిమా షూటింగ్ జరుగుతున్నట్టు తెలుసుకున్నారు. ఆ నిర్మాణాన్ని కూలగొట్టి తాటిదుంగలు భద్రపరిచారు. ప్రభుత్వం నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు ఇరవై నాలుగు గంటలూ అక్కడ కాపలా ఉంచాలని, సొసైటీ తవ్వకాలు జరపకుండా చూడాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఇదిలావుండగా దీనిపై వీఎంఆర్డీఏ అధికారులు దీనిపై స్పందిస్తూ 2019లోనే లేఅవుట్లకు అనుమతులు ఇచ్చే అధికారం జీవీఎంసీకి ప్రభుత్వం అప్పగించిందని, ఈ సొసైటీ పనులతో వీఎంఆర్డీఏకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం

గాజువాక, జూలై 17: గాజువాక లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం బుధవారం ఎన్నికైంది. ఇక్కడి లయన్స్ క్లబ్ భవనంలో జరిగిన కార్యక్రమంలో 2024-25 సంవత్సరానికి గాను స్టీల్ సిటీ రోటరీ క్లబ్ అధ్యక్షునిగా బాసంగి తిరుపతిరావు, కార్యదర్శిగా జి.రామునాయుడు, కోశాధికారిగా బి.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. వీరితో రోటరీ-3020 అసిస్టెంట్ గవర్నర్ కె.మురళీకృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజా ప్రయోజన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కేవై దాస్, తెంటు సత్యనారాయణ, కొల్లి సత్యంబాబు, చంద్రశేఖర్, వసంత పటేల్ పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు: ఇద్దరికి స్వల్ప గాయాలు

శ్రీనగర్, జూలై 17: గాజువాక నుంచి అనకాపల్లి వెళ్తున్న ఓ కారు బుధవారం రాత్రి స్టీరింగ్ లాక్ పడటంతో డివైడర్‌ను ఢీకొంది. దీంతో కారులో ఉన్న నలుగురిలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. దువ్వాడ ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సాయంతో కారును పక్కకు తీశారు. స్వల్పంగా గాయపడిన మోహన్, ధనలక్ష్మిలను ఆస్పత్రికి తరలించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

పెందుర్తి, జూలై 17: సుజాతనగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతు పనులుచేపడుతున్నందున గురువారం ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా సుజాతనగర్ సీ1, సీ2 జోన్, కార్మికనగర్, గిరిప్రసాద్ నగర్ 1,2,3 వెంకటాద్రినగర్, డాక్‌యార్డ్ లేఅవుట్, టీచర్స్ లే అవుట్, నాగమల్లినగర్, ఆంజనేయులునగర్, సుజాత నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు..

సుజాతనగర్ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ తెలిపారు. అందువల్ల ఏటీ జోన్లు, పెట్రోల్ బంక్ ఏరియా, సుజాతనగర్ మెయిన్ రోడ్డు, ఓ జోన్ పార్కు, శారదాపీఠం, సప్తగిరినగర్, గణేశ్‌నగర్, అంబేడ్కర్‌నగర్, వెంకటేశ్వరస్వామి ఆలయం, బ్యాంకు కాలనీ, వెంకటాద్రినగర్, సుజాతనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలంతా ఈ విషయాన్ని గుర్తించి తమకు సహకరించాలని కోరారు.

ముగిసిన జగన్నాథుని ఉత్సవాలు

పెందుర్తిరూరల్, జూలై 17: మండలం చింతలఅగ్రహారం గవరపాలెం కాలనీలోని గోపాలకృష్ణ ఆలయంలో జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. సాయంత్రం జగన్నాథస్వామి, సుభద్ర, బలభద్రలతో తిరుగు రథయాత్ర నిర్వహించారు. కృష్ణుని ఆలయం వద్ద నుంచి గణేశ్‌నగర్, లక్ష్మీపురం, దుర్గానగర్, శివాలయం, రామాలయాల మీదుగా వీరాంజనేయ స్వామి ఆల యం వరకు సాగింది. అర్చకుల సత్కారం, భక్తుల ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు పెద్దింటమ్మ అమ్మవారి పండగ



మల్కాపురం, జూలై 17: మల్కాపురంలో గురువారం పెద్దింటమ్మ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించేందుకు గ్రామ కమిటీ పెద్దలు ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగానే అమ్మవారి చదనపట్టు వద్దకు చేరుకుని బుధవారం చాటింపు కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలో ఏటా ఆషాఢ మాసం రెండో గురువారం అమ్మవారి పండగను చేయడం అనవాయితీ. ఈ నేపథ్యంలో గురువారం భక్తులు దర్శించనున్నారు. సాయంత్రం ఊరేగింపు ఉంటుంది.

సినిమా గైడ్

● **భారతీయుడు-2:** జగదాంబ, శారద, మెలోడి, రమాదేవి, సంగం, వెంకటేశ్వర-1, కిన్నెర, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక) శ్రీకన్య సినీపోలీస్ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి),

● **కల్కి:** శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య, గణేష్, సప్తగిరి (తగరపువలస)

● **సారంగదరియా :** శ్రీవెంకటేశ్వర, శ్రీ నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 67, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 18, పచ్చిమిర్చి 68, కాకరకాయలు 42, బీరకాయలు 30, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 42, క్యాబేజీ 30, క్యారెట్ 30, దొండకాయలు 30, బంగాళదుంపలు 32, అరటికాయ (పె)6, అల్లం (పాతది) 140, మునక్కాడలు (కిలో) 100, బరబాటి 32, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 50, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 94, పొటల్స్ 40, కీరదోస 26, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 36, కంద 62, దేశీ, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	92
ఫారం ధర	--	112
విత్ స్కిన్	--	194
స్కిన్‌లెస్	--	204

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

అడుగడుగునా ట్రాఫిక్ ఇబ్బందులు

రాత్రి వేళల్లో మరింత అధికంగా ఉంటున్నాయని వాపోతున్న వాహనదారులు

సమస్య పరిష్కారానికి పోలీస్ ఉన్నతాధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి



గాజువాక వందడుగుల రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

గాజువాక, జూలై 17: గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో వాహనదారులు అడుగడుగునా ట్రాఫిక్ ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధానంగా ఉదయం ఎనిమిది నుంచి పది, సాయంత్రం ఐదు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు కీలక జంక్షన్లతో పాటు ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఆయా సమయాల్లో వాహనాల తాకిడి అధికంగా ఉండడమే ఇందుకు ప్రధాన కారణంగా వాహనదారులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఆయా సమయాల్లో కీలక జంక్షన్లలో ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ కొరవడడం వల్ల వాహనదారులు ఇష్టారాజ్యంగా వాహనాలను నడుపుతుండడంతో నాలుగు వైపుల నుంచి వచ్చే వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నాయి. దీంతో ఎక్కువ సమయం ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నామని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు పలు కీలక కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయకపోవడం వల్ల కూడా ట్రాఫిక్ ఇబ్బందులు అధికమవుతున్నాయి. ప్రధానంగా జగ్గు జంక్షన్, వంటిల్లు కూడలి, వందడుగుల రోడ్డు, కొత్త గాజువాక జంక్షన్, చినగంట్యాడ కూడలి, తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయి. గాజువాక ప్రాంతంలోని కీలక కూడళ్లలో నిత్యం వాహనదారులు అస్తవ్యస్త ట్రాఫిక్ మూలంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. కొత్త గాజువాక నుంచి పాత గాజవాక కూడలికి వెళ్లేందుకు ఎక్కువ సమయం పడుతున్నందున ట్రాఫిక్ సమస్యపై పోలీస్ ఉన్నతాధికారులు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



గ్రీన్ సిటీలోని శ్రీవారి ఆలయంలో స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకుడు



నాయుడుతోటలో ప్రత్యేక అలంకరణతో శేషపాన్పుపై కల్యాణ వేంకటేశ్వరస్వామి



పెందుర్తి వెంకటాద్రి శిఖరంపై పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి

వైభవంగా తొలి ఏకాదశి పూజలు

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై శ్రీవారికి నివేదించిన వంద కిలోల పులిహోర

కూర్మన్నపాలెం, జూలై 17: తొలి ఏకాదశి పూజలను శ్రీవారి ఆలయాలతో పాటు పలు దేవాలయాల్లో బుధవారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా 88వ వార్డు గ్రీన్ సిటీలోని వైభవ్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు శ్రీధర్ స్వామి, వాసుస్వామిల పర్యవేక్షణలో శ్రీవారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బండి సురేశ్‌కుమార్, సుబ్రహ్మణ్యం, వీవీ కృష్ణారావు, పద్మజ, రాజ్యలక్ష్మీ, వి.వెంకటరావు, సునిల్, తదితరులు పాల్గొన్నారు. అలాగే 87వ వార్డు పరిధి రాజులపాలెంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు కె.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని ప్రత్యేక పుష్పాలు, తులసి మాలలతో అలంకరించి పంచామృతాభిషేకాలు, హోమాలు జరిపారు. అనంతరం లోక కల్యాణార్థం శ్రీవారి కల్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించారు. మధ్యాహ్నం చేపట్టిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ లోపల గల పురాతన శివాలయంలో తొలి ఏకాదశి పూజలను వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్టీల్‌ప్లాంటుకు అంతా మంచి జరగాలంటూ పలువురు ఆకాంక్షించారు. అనంతరం ఆలయంలో అత్యంత వైభవంగా శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని జరిపారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు బద్రునాయక్, యేల్లేటి శ్రీనివాస్, శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: స్థానిక వెంకటాద్రి శిఖరంపై కొలువైయున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆషాఢ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపి అభ్యంగన స్నానమాచిరించారు. విగ్రహాన్ని శోభామయంగా అలంకరించారు. అనంతరం స్వామికి అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించారు. లక్ష తులసీ దళ పూజ నేత్రపర్వంగా సాగింది. భక్తులు గోవింద నామస్మరణలతో వెంకటాద్రి మారుమోగింది. పలువురు భక్తులు స్వామికి తులాభారం సమర్పించారు.

వేపగుంట: నాయుడుతోట శ్రీ కల్యాణ వెంకటేశ్వరాలయంలో తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహావిష్ణువు శేష పాన్పుపై ఉన్న స్వామివారిని అలంకరించి అర్చనలు చేపట్టారు. భరత్‌నగర్ దరి శ్రీ లక్ష్మీనరసింహనగర్‌లో గోపిజనవల్లభస్వామి ఆలయంలో గోవుపాలతో అభిషేకం , ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భగవద్గీత పారాయణం చేశారు. వేపగుంటలో శాకంబరి దేవిగా శ్రీ ముత్యాలమ్మను అలంకరించారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: విమాననగర్‌లోని వెంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివారి కల్యాణం చేశారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వెంకటాద్రిపై వెలసిన స్వయంభూ వేంకటేశ్వరునికి లక్ష తులసీదళార్చన చేసి తులసి మాలలతో అలంకరించారు. శ్రీవారికి సుప్రభాత సేవ ప్రత్యేక పూజలు చేయగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకునాన్నరు. 108 మంది మహిళలు వేంకటేశ్వర నామ పారాయణాన్ని పఠించారు. కోలాటం ప్రదర్శన అలరించింద. యల్లపు మహాలక్ష్మీ నాయుడు, ప్రభ, మోహన్‌లు స్వామివారికి వెండి శఠగోపం, వెండి పళ్లెం, పంచపాత్రను సమర్పించారు. కార్య క్రమంలో ఆలయ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంజుల, సభ్యులు రామలక్ష్మీ, వెంకటనాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే నెల్లిముక్కు సీతారామాల యంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు జరిపారు.

అగనంపూడి: అగనంపూడి కూడలిలో ఉన్న జగన్నాథస్వామి ఆలయంలో ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా బలభద్ర, సుభద్ర, జగన్నాథస్వామిని బంగారు ఆభరణాలతో అలంకరించి అర్చనలు, అభిషేకాలు చేయగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు కరణం పైడిరాజు, టీడీపీ వార్డు మహిళా అధ్యక్షురాలు గొల్లవిల్లి కనకభవానీ, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జి.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే శాంతినగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆల యంలో పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఈకే చారి, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై ఉన్న వేంకటేశ్వర వినాయక స్వామి దేవస్థానంలో అన్నకూటోత్సవం అందరినీ భక్తపరవశుల్ని చేసింది. ప్రధాన అర్చకులు లక్ష్మణాచార్యులు, నారాయణచార్యుల ఆధ్వర్యంలో శ్రీవారికి ప్రత్యేక ప్రత్యేక పూజలు జరిపాక సుమారు వంద కిలోల పులిహోరను స్వామి వారి ముందుంచి ఏడు కొండల ఆకారంలో తీర్చిదిద్ది పువ్వులు, పండ్లతో అలంకరించి నైవేద్యంగా వందలాది మంది విచ్చేసి శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే షీలానగర్ ఎస్‌టీబీఎల్‌లోని తిరుమల బాలజీ దివ్య క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

గోపాలపట్నం: ఆషాఢ ఏకాదశిని పురస్కరించుకుని గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కొత్తపాలెం గ్రామంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో పరిసర ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ

కూర్మన్నపాలెం, జూలై 17: స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ డిమాండ్ చేశారు. బుధవారం కూర్మన్నపాలెంలో 1252వరోజు రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థలను విచ్ఛిన్నం చేస్తూ రాష్ట్రాల ఆర్థిక బలాలనూ, హక్కులనూ హరించి వేయటం తగదన్నారు. విశాఖ ఉక్కు ద్వారానే ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం వద్ద ఉక్కు కర్మాగార అభివృద్ధి కోసం ప్రణాళికలు ఉన్నా వాటిపై దృష్టి సారించలేదన్నారు. దీనివల్ల దేశంలో నిరుద్యోగం పెరుగుతుందన్నారు. నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగాన్ని మరింతగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ దుర్మార్గ విధానాలను కార్మికులు తిప్పికొట్టాలన్నారు. ఉద్యోగులతో పాటు ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, మహిళలు, యువత ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వరసాల శ్రీనివాసరావు, ఎన్.రామారావు, కాంద్రేకుల శ్రీనివాస నాయుడు, మోహిద్దీన్, కామేశ్వరరావు, అప్పారావు, గోపి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చాతుర్మాస వ్రత మహోత్సవాలకు శ్రీకారం

పెందుర్తి, జూలై 17: మండలంలోని రాంపురంలో సాధూ మఠంలోని శ్రీరామానంద జ్ఞానానంద ఆశ్రమంలో ఆషాఢ శుద్ధ ఏకాదశి సందర్భంగా బుధవారం సాధూ సంతతులు చాతుర్మాస్య వ్రత మహోత్సవాలకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షులు స్వామి శ్రీనివాసానంద సరస్వతి హాజరై చాతుర్మాస్య దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. చాతుర్మాస్య దీక్ష విశిష్టను వివరించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీతో కలిసి ఆయన ఆశ్రమ ప్రాంగణంలో మొక్కలు నాటారు. సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు, ప్రవాస భారతీయుడు అన్నంరెడ్డి రమేశ్, అవగడ్డ అప్పలనాయుడు, సాధూ మఠం చైర్మన్ బోకం జ్ఞానేశ్వరరావు, కార్యదర్శి అన్నంరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారులకు నేడు అవార్డులు ప్రదానం

పెందుర్తిరూరల్, జూలై 17: మాజీ ఎంపీ, సీనియర్ తెలుగుదేశం నాయకుడు పెతంశెట్టి స్మారకార్థం శ్రీసాయి శ్రీనివాస కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేపగుంట దరి నాయుడుతోట లక్ష్మీ కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం ప్రముఖ రంగస్థల కళాకారులకు సింహాద్రి అవార్డులను అందజేయనున్నట్లు అధ్యక్షుడు పొలిమేర సీతారాం తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్. నాయుడు (గణబాబు) ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. అనంతరం రంగస్థల కళాకారులు గయోపాఖ్యానం (యుద్ధ సీన్), సత్య హరిశ్చంద్ర (వారణాసి) ఘట్టాలను ప్రదర్శించనున్నట్టు చెప్పారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కూర్మన్నపాలెం, జూలై 17: కణితి పాఠశాలలో బుధవారం రాష్ట్ర స్థాయి 11వ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌కు క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం వాల్తేరు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ (విశాఖపట్నం) ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని పలు కళాశాలలు, పాఠశాలల నుంచి పలువురు క్రీడాకారులు హాజరయ్యారు. అసోసియేషన్ అధ్యక్షుడు మామిడి రమణ మాట్లాడుతూ ఆగస్టు 10,11,12 తేదీల్లో గుంటూరులోని వినుకొండలో జరగనున్న రాష్ట్ర స్థాయి క్రీడల్లో విశాఖ నగరానికి ప్రథమ స్థానాన్ని తీసుకురావాలన్నారు. కణితి హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.మన్నాజీ, పీడీలు నారాయణరావు, సతీశ్, దేముడు, బాబు, భవాని, రవి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాప్య పింఛన్లకు అర్హులుగా గుర్తించాలని వినతి

గాజువాక, జూలై 17: ఆర్టీసీలో విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన ఉద్యోగులను వృద్ధాప్య పింఛన్లకు అర్హులుగా గుర్తించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును విశ్రాంత ఉద్యోగులు కోరారు. బుధవారం ఇక్కడి టీడీపీ కార్యాలయంలో వారు పల్లాను కలిసి పలు సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. రిటైరైన ఉద్యోగులకు 2014 నుంచి రూ.వెయ్యి పెన్షన్ మాత్రమే ఇస్తున్నారని, అందువల్ల తమకు వృద్ధాప్య పింఛన్లు ఇవ్వాలని గత ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. తమ సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. పల్లాను కలిసిన వారిలో విశ్రాంత ఉద్యోగులు వీవీకే రాయ్, కేఆర్ ఆంజనేయులు, ప్రసాద్, తదితరుతు ఉన్నారు.

వైసీపీ నేతలు కొల్లగొట్టిన ప్రతి రూపాయి వసూలే లక్ష్యం

'పశ్చిమ' ఎమ్మెల్యే పి.గణబాబు



గోపాలపట్నం, జూలై 17: వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలు భూములు, సహజ వనరుల దోపిడీతో కొల్లగొట్టిన ప్రతి రూపాయిని తిరిగి ప్రభుత్వ ఖజానాకు చేర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్టు పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. ఆయన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ పాలనలో జరిగిన అక్ర మా లు, భూ దందాలు, సహజవనరుల దోపిడీపై ఆధారాలతో శ్వేతపత్రం ముద్రించనున్నట్టు పేర్కొన్నారు. వైసీపీ పాలనలో 1.75 లక్షల ఎకరాల భూ ఆక్రమణ జరిగిందన్నారు. వీటి విలువ రూ. 35, 576 కోట్లకు పైగా ఉంటుందన్నారు. ఇళ్ల పట్టాల పేరుతో రూ.10 వేల ఎకరాలు, ఇసుక దందాలో రూ. 9, 750 కోట్లు దోచుకున్నారన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ కోసం 501 జీవోను భూ దోపడిడీకి వినియోగించుకున్నారని ఆరోపించారు. ఎక్కడాలేని విధంగా తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను కూటమి ప్రభుత్వం రద్దుచేసిందని అన్నారు. వైసీపీ పాలనలో అక్రమ మైనింగ్, సహజ వనరుల దోపిడీ యథేచ్ఛగా జరిగిందన్నారు. ఇళ్ల పట్టాల్లోనూ ప్రజాధనాన్ని కొల్లగొట్టారని ఆరోపించారు. రుషికొండలో సుమారు రూ. 500 కోట్లతో ప్యాలెస్ నిర్మించారని అన్నారు. భూహక్కు పేరుతో ప్రచారానికి రూ.13 కోట్లు ఖర్చు చేశారన్నారు. వైసీపీ పార్టీ కార్యాలయాల నిర్మాణం కోసం కోట్ల విలువ చేసే భూముల్ని కేటాయించుకున్నారని అన్నారు. ఉచిత ఇసుక పేరుతోనూ మోసగించారన్నారు. వీటిని తప్పకుండా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

రిటెయినింగ్ వాల్‌ల నిర్మాణానికి కృషి: గణబాబు

కొండవాలు ప్రాంతాల్లో అవసరమైన చోట్ల రిటైనింగ్ వాల్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని పశ్చిమ ఎమ్మెల్యే పి. గణబాబు అన్నారు. నగర పరిధి 91వ వార్డు రామకృష్ణానగర్ కొండవాలు ప్రాంతాల్లో పశ్చిమ ఎమ్మెల్యే బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా మూడేళ్ల క్రితం ఈ ప్రాంతంలో కొండచరియలు జారిపడిన ప్రదేశాన్ని పరిశీలించారు. అలాగే, ప్రమాదకరంగా ఉన్న ప్రదేశాల్లో రిటైనింగ్‌వాల్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో కొండచరియలు జారిపడే అవకాశం ఉన్న ప్రా ంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రణాళిక

డీసీపీ-2గా తుహిన్ సిన్హా



డీసీపీగా బాధ్యతలు స్వీకరిస్తున్న తుహిన్ సిన్హా

గాజువాక, జూలై 17: శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతామని డీసీపీ-2గా తుహిన్ సిన్హా పేర్కొన్నారు. గాజువాక పోలీస్ స్టేషన్ కాంప్లెక్స్‌లో బుధవారం చేపట్టిన చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయిని పూర్తిగా నిర్మూలించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ప్రశాంత నగరంగా విశాఖను మార్చడానికి అందరి సహకారంతో ముందుకు సాగుతామన్నారు. డీసీపీకి పలు స్టేషన్ల సీఐలు, ఎస్‌ఐలు అభినందనలు తెలిపారు. ఇదిలావుండగా ఇప్పటివరకు డీసీపీగా విధులు నిర్వర్తించిన ఎం.సత్తిబాబుకు పలువురు సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది వీడ్కోలు పలికారు.

డీసీపీని కలిసిన ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు

ఉక్కుటౌన్‌షిప్: డీసీపీ-2గా బాధ్యతలు స్వీకరించిన తుహిన్ సిన్హాను స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. శాంతిభద్రతల పర్యవేక్షణలో తాము పూర్తి సహకారాన్ని అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు బయ్యే మల్లయ్య, మోహన్‌బాబు, అంజిబాబు, సాయిప్రసాద్, అరవింద్‌కుమార్ పాల్గొన్నారు.

'నామినేటెడ్ పోస్టుల్లో బీజేపీ నాయకులకు స్థానం కల్పించాలి'




పల్లా శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, జూలై 17: నామినేటెడ్ పోస్టుల్లో బీజేపీ నాయకులకు స్థానం కల్పించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు కోరారు. గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన పల్లాను కలిసి పలు అంశాలపై చర్చించారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న బీజేపీ నాయకులకు సముచిత స్థానం కల్పించాలన్నారు. ఆగస్టు తొలి వారంలో ఇక్కడి బీజేపీ కార్యాలయంలో జరిగే అభినందన సభకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. కాగా బీజేపీ నాయకుల జాబితా ఇవ్వాలని పల్లా అడిగినట్టు నరసింగరావు తెలిపారు. నాయకులు ఈశ్వరరావు, యల్లాజీరావు, నాగేశ్వరరావు, వెంకటరావు, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి

టీడీపీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లారి సూర్యనారాయణ



ప్రజలతో మాట్లాడుతున్న నల్లారు సూర్యనారాయణ, తదితరులు

కూర్మన్నపాలెం, జూలై 17: ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లారి సూర్యనారాయణ పేర్కొన్నారు. వార్డు పరిధిలోని చినయాతపాలెం, లక్కరాజుపాలెం, సాయిరాంనగర్ కాలనీలలో బుధవారం కూటమి నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, విద్యుత్ దీపాలు, డ్రైనేజీలు, రహదారుల సమస్యలను స్థానికులు వివరించారు. ఆయా సమస్యలను తక్షణమే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కాద శ్రీను, రామారావు, మాడిశ కనకరాజు, వేగుంట శ్రీనివాస్, వెంకటసుబ్బయ్య, నాగార్జున, వీరభద్రరావు, నాగరాజు, వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు నిర్లక్ష్యం వల్లే కలుషిత నీటి సరఫరా

అగనంపూడి, జూలై 17: జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు కలుషిత నీటిని తాగాల్సి వస్తోందని స్థానిక అభివృద్ధి కమిటీ సభ్యులు పేర్కొన్నారు. బుధవారం స్థానికంగా జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడారు. ఏలేరు కాలువ నుంచి ఇక్కడి 85 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటుకు వచ్చే నీరు పూర్తిగా అపరిశుభ్రంగా ఉంటుందన్నారు. కొప్పాక సమీపంలో ఏలేరు కాలువలో మురుగు నీరు కలుషితం కావడంతో పాటు మల మూత్రాలతో ఉన్న నీటిని విడిచిపెడుతున్నారన్నారు. ఈ విషయాన్ని గత కమిషనర్ సాయికాంత్‌వర్మ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని పేర్కొన్నారు. దీనివల్ల అగనంపూడితో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఆ నీటినే తాగాల్సి వస్తుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి కొప్పాక వద్ద నీరు కలుషితం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ ప్రతినిధులు బలిరెడ్డి సత్యనారాయణ, బి.అప్పారావు, కన్నారావు, వరహాలు, శ్రీను, విందుల కిశోర్, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



డాగ్ స్క్వాడ్‌తో పర్యవేక్షిస్తున్న పోలీసులు

సీతమ్మధార, జూలై 17: నగర సీపీ శంఖబ్రత బాగ్చీ ఆదేశాలతో బుధవారం రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా నియంత్రణలో భాగంగా ఎస్ఈబీ సీఐ టి.వెంకట అప్పలనాయుడు, సీహెచ్.రాజులునాయుడు ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ ఎస్. మురళినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్సిటీల్లో పోస్టుల భర్తీపై హర్షం

అక్కయ్యపాలెం, జూలై 17: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లో న్యాయపరమైన సమస్యలను తొలగించి 3,220 ఉద్యోగాల భర్తీ కి విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ చర్యలు తీసుకోవడంపై ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ హర్షం వ్యక్తం చేశారు. అలాగే, గతేడాది ఆగిపోయిన కానిస్టేబుల్స్ ఎంపిక ప్రకియలో అభ్యర్థులకు గ్రేస్ మార్కులు వేసి భర్తీ చేయాలని కోరారు. అన్ని విశ్వవిద్యాలయాల్లో రెగ్యులర్ వీసీలను నియమించాలని కోరారు.



వైశాఖి జల ఉద్యాన వనం వద్ద నమాజ్‌లో ముస్లింలు



మర్రిపాలెంలో ప్రార్థనలు

భక్తి శ్రద్ధలతో మొహర్రం

» వైశాఖీ జలఉద్యాన ప్రాంగణానికి తరలివచ్చిన ముస్లిం కుటుంబాలు » నమాజ్‌లు, ప్రార్థనలు

జగదాంబ కూడలి, జూలై 17: ముస్లింలు భక్తిశ్రద్ధలతో మొహర్రంను బుధవారం జరిపారు. నగరంలోని పలు మసీదుల నుంచి కుటుంబాలతో భారీ సంఖ్యలో వన్‌టౌన్‌లోని వైశాఖి జల ఉద్యానవన ప్రాంగణంలోని పీర్ల కోనేరు వద్దకు వచ్చారు. మతాచారం ప్రకారం అల్లాకు నమాజ్ జరిపారు. మొక్కులు చెల్లించుకున్నారు. నగరంలో 60,70 ఏళ్లకు పైగా ఇక్కడ పీర్ల పండగ ఆచారం కొనసాగుతోంది. అయితే, గతంలో వైశాఖి జల ఉద్యాన వనం వద్ద కోనేరు ఉండేది. ఏటా వన్‌టౌన్ పరిసరాల్లోని ముస్లింలు వచ్చి నమాజ్ చేసేవారు. ప్రస్తుతం కోనేరు అంతరించిపోవడం తో మత పెద్దల ఆచారం ప్రకారం సూపర్‌బజారు మార్గంలో ఉన్న కోనేరు, చెట్ల వద్దకు కుటుంబాలతో వచ్చి పీర్ల పండగ రోజున అల్లాకు భక్తితోపూజలు జరుపుతారు. ఈ నేపథ్యంలో టర్నర్ చౌల్ట్రీ నుంచి నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం వరకు భారీ సంఖ్యలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనరాకపోకలను నియంత్రిం చారు. వేల సంఖ్యలో ముస్లింలు పీర్ల కోనేరువద్ద ప్రార్థనల్లో పాల్గొన్నారు. మతాచారం ప్రకారం షర్బత్, బిర్యానీ ప్యాకెట్లు పంచిపెట్టారు. సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నమాజ్‌లు కొనసాగాయి.

మర్రిపాలెం: మర్రిపాలెం జాకీర్‌హుస్సేన్ నగర్‌లోని మజీద్ ఈ అల్ ఖదీర్ ఆధ్వర్యంలో బుధవారం మసీద్ ప్రాంగణంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం మతగురువు తఖీర్ పఠించారు. అనంతరం మసీద్ కమిటీ ఆధ్వర్యంలో తయారు చేసిన ప్రత్యేక పానీయాన్ని ముస్లింలకు అందజేశారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే మొహర్రం రోజున ఏటా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామని కమిటీ అధ్యక్షుడు మున్నా తెలిపారు.

'ఏయూ వీసీగా దళితులకు అవకాశం ఇవ్వాలి'



మాట్లాడుతున్న జేవీ ప్రభాకర్

సీతమ్మధార , జూలై 17: ఏయూ వీసీగా దళితులకు అవకా శం కల్పించాలని దళిత హక్కుల పోరాట సమితి అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ డిమాండ్ చేసింది. బుధవారం అంబేడ్కర్ భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏయూ ప్రపంచ స్థాయి గుర్తింపు కలిగిన ఎందరో ప్రతిభావంతులను శాస్త్రవేత్తలను తీర్చిదిద్దిన ఘనత ఉందన్నారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ వంటి వారు ఏయూలో పనిచేశారన్నారు. గత వీసీ ప్రసాద్‌రెడ్డి ఆ స్థాయిని దిగజార్చారన్నారు. ఎంతో మంది అనర్హులను అనేక పదవుల్లో నియమించారని ఆరోపించారు. అర్హులైన వారినిత ఉద్యోగాల నుంచి తొలగించి వారిని వేధించినట్టు ఆరోపించారు. ఈస్థితిలో వర్సిటీలో సెర్చ్ కమిటీ వేయాలని, కొత్త పరిశోధనలను ప్రోత్సహించాలని కోరారు. ఇవేవీ చేపట్టకుండా ఆరేళ్లుగా వర్సిటీ స్థాయిని దిగజార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అత్యంత విద్యార్హతలు, సీనియర్లు, సమర్థత కలిగిన దళిత ప్రొఫెసర్లు ఉన్నారని తెలిపారు. వీరికే వీసీ పోస్టు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు ఎస్. రాజు, కార్యదర్శి జి. రాంబాబు పాల్గొన్నారు.

విద్యా ప్రదాత ఆనందగజపతిరాజు



విద్యార్థినికి నగదు ప్రోత్సాహం అందిస్తున్న సుధా గజపతిరాజు, తదితరులు

సింహాచలం, జూలై 17 : విజయనగర సంస్థానాధీశుడు, సింహాచలం దేవస్థానం పాలక మండలి మాజీ చైర్మన్ పూసపాటి ఆనందగజపతిరాజు విద్యా రంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి అన్నారు. ఆనంద గజపతిరాజు 75వ జయంతి పురస్కరించుకుని ఈఓ కార్యాలయంలో బుధవారం పలువురు ఆనందగజపతిరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఈఓ, దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు తదితరులు మాట్లా డుతూ ఆనందగజపతిరాజు చేసిన సామాజిక సేవలను గుర్తు చేశారు. అనంతరం పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాల విద్యార్థిని పూర్ణిమకు సుధా గజపతి, ఊర్మిళా గజపతి నగదు ప్రోత్సాహకం అందజేశారు.

నేటి నుంచి టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమం

కంచరపాలెం, జూలై 17 : విశాఖ జిల్లాలోని ఎంఈఓలు,ప్రధానోపాధ్యాయులు,సీఆర్పీలకు గురువారం నుంచి పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో టీచ్ టూల్ బోధనపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సమగ్ర శిక్షా అడిషినల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు పేర్కొన్నారు.రెండో విడతలో శిక్షణ పొందని అధికారులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు 120 మంది ఈ శిక్షణను తీసుకోనున్నారు. ఈనెల 18వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమై 27వ తేదీతో ముగియనుందన్నారు. టీచ్ టూల్‌లో పొందిన శిక్షణ అనంతరం పాఠశాలల్లో వారు బోధనను పర్యవేక్షించాల్సి ఉంటుంది.

ప్రకృతిని పరిరక్షించాలి



ఎయిర్‌పోర్టు పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

మర్రిపాలెం, జూలై 17: ప్రకృతిని మనం కాపాడితే ప్ర కృతి మనల్ని కాపా డు తుందని సా మాజిక కార్యకర్త భూష ణరావు అన్నారు. బుధ వారం ఎయిర్‌పోర్ట్ పోలీ సు స్టేషన్ ఆవరణలో ఆయన పోలీసు సిబ్బం దితో కలిసి మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనం హరించుకుపోవడంతో వాతావరణ కాలుష్యం విపరీతం పోతోందన్నారు. భవిష్యత్తు తరాలపై దీని ప్రభావం చూపకుండా ప్రతి ఒక్కరు బాధ్యతగా పచ్చదనం పెంపొందేంచేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రవిచంద్ర, ఉషా తదితరులు పాల్గొన్నారు.

గండి బాబ్జీకి అభినందనలు

సీతమ్మధార, జూలై 17: తెలుగుదేశం పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు గండి బాబ్జీని విశాఖ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుంటూరు నరసింహారావు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువతో సత్కరించారు.

జీపీఎస్ నిలిపివేతపై ఎస్టీయూ హర్షం



సమావేశంలో ఎస్టీయూ నాయకులు

డాబాగార్డెన్స్, జూలై 17: దాదాపు నాలుగు లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు మేలు చేసే విధంగా జీపీఎస్ చట్టాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిలిపివేయడంపై ఎస్టీయూ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీపీఎస్‌ను పూర్తిగా రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, గత ఐదేళ్లుగా కోరుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో జీపీఎస్ రద్దు చేయడం అభినందించదగిన విషయమన్నారు. ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేసే వరకు తాత్కాలిక భృతి 30 శాతం వెంటనే ప్రకటించాలని కోరారు. విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ పాదయాత్రలో ప్రకటించిన 117 జీవోను రద్దు చేయాలనికోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పైలా దేముడుబాబు, రాష్ట్ర కార్యదర్శులు రామిరెడ్డి, పద్మావతి, కార్యదర్శి సునీత, ఉపాధ్యక్షులు ప్రభాకర్, కార్యదర్శి వరహాలదొర, గౌరవాధ్యక్షులు సన్యాసిరావు, అప్పలరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ సామగ్రి పంపిణీ



స్టేషనరీ అందజేస్తున్న నేషనల్ హ్యూమన్‌రైట్స్ ప్రతినిధులు

సీతమ్మధార, జూలై 16: సీతమ్మధార బాలయ్య శాస్త్రి లే అవుట్‌లో గల పాపాహోమ్ విద్యార్థులకు నేషనల్ హ్యూమన్‌రైట్స్ ఆధ్వర్యంలో స్టేషనరీ సామగ్రితో పాటు స్వీట్స్ పంపిణీ చేశారు. విద్యార్థులంతా చదువు పట్ల శ్రద్ధ చూపాలని ఈసందర్భంగా హ్యూమన్‌రైట్స్ ప్రతినిధి డాక్టర్ విజయ్ మోహన్ కోరారు. క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక ప్రతినిధులు కన్నబాబు, నరసింహరావు, ఫాతిమా బేగం పాల్గొన్నారు.

మూర్ఛ వ్యాధితో యువకుడి మృతి

కూర్మన్నపాలెం, జూలై 17: మూర్ఛ వ్యాధితో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ సమీపంలోని సురాయ్‌పూర్‌కు చెందిన గణేశ్‌కుమార్ విశ్వకర్మ (23) నెల రోజుల క్రితం బతుకు తెరువు నిమిత్తం వచ్చి అగనంపూడి గల్లవానిపాలెంలో అన్నపూర్ణ ఆటోమొబైల్స్ వాషింగ్ సెంటర్‌లో పనిలో చేరాడు. బుధవారం రాత్రి బైక్‌కు వాషింగ్ చేస్తుండగా మూర్ఛ వ్యాధి వచ్చి వెనక్కి పడిపోయాడు. వెంటనే గణేశ్‌కుమార్ విశ్వకర్మ స్నేహితులు అగనంపూడి ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకువెళ్లగా, పరీక్షించిన వైద్యులు గుండెపోటు రావడంతో మృతి చెందినట్టు నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఏసీపీ త్రినాథ్, సీఐ ఎర్రంనాయుడు ఆస్పత్రికి చేరుకుని మృతుని వివరాలను తెలుసుకున్నారు.

వలసదారులకు బియ్యం పంపిణీలో ఇబ్బందులు

డీఎస్‌వో జోక్యంతో తాత్కాలికంగా సమసిన సమస్య

విశాఖపట్నం, జూలై 17(ఆంధ్రజ్యోతి): నగరానికి ఉపాధి నిమిత్తం తాత్కాలికంగా వలసవచ్చిన కుటుంబాలకు రేషన్ బియ్యం పంపిణీలో వివక్షత చూపుతున్నట్టు ఆరోపణలున్నాయి. వన్‌రేషన్- వన్ నేషన్ కింద దేశంలో ఏ ప్రాంతానికి చెందిన వారైనా ఎక్కడైనా రేషన్ తీసుకునే వెసులబాటు ఉంది. అయితే, నగరలో మధురవాడ, ఆరిలోవ, పెందుర్తి, గాజువాక, ఇసుకతోట ప్రాంతాల్లో ఉంటున్న వలసకుటుంబాలకు రేషన్ కార్డులపై బియ్యం అందజేతలో జాప్యమవుతోంది. తొలుత స్థానికంగా ఉండే కుటుంబాలకు బియ్యం పంపిణీకి డీలర్లు మొగ్గుచూపుతున్నారు. తరువాత డిపోల్లో బియ్యం ఉంటేనే వలసదారులకు అందజేస్తున్నారు. సాధారణంగా వలసదారులు బియ్యం విడిపించి వినియోగానికి వాడుతారు. అదే నగరంలో చాలామంది విక్రయిస్తున్నారు. దీనివల్ల డీలరు/ఎండీయూలు స్థానికంగా ఉండే వారికే తొలుత బియ్యం ఇచ్చి తరువాత వలసదారులకు పంపిణీచేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నెలకు అదనపు కోటా అధికారులు ఇవ్వలేదు. ఫలితంగా మధురవాడ, ఆరిలోవ, ఇసుకతోట తదితర ప్రాంతాల్లో వలసదారుల్లో కొంతమందికి బియ్యం అందకపోవడంతో వారంతా ఆందోళన వ్యక్తంచేశారు. దీంతో జిల్లా పౌరసరఫరాల అధికారి సూర్యప్రకాశరావు స్పందించి జిల్లాలో డీలర్ల వద్ద మిగిలిన బియ్యం సమీకరించి ఎక్కడైతే అవసరమో ఆయా డిపోలకు పంపడంతో సమస్య తాత్కాలికంగా ముగిసింది. ఈనెలకు సంబంధించి బుధవారానికి 96.95శాతం కార్డుదారులకు బియ్యం పంపిణీ చేశారు.

సినీ సంగీత విభావరి రేపు

డాబాగార్డెన్స్, జూలై 17: భూషణ్‌బ్రదర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 19న డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలోని 'రాముని అవతారం రవికుల సోముని అవతారం' పేరిట సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్టు సీనియర్ కళాకారులు తెలిపారు.బుధవారం సాయంత్రం డాబాగార్డెన్స్‌లో ఈ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూషన్‌బ్రదర్స్ 32వ వార్షికోత్సవం పురస్కరించుకుని 19 తేదీ సాయంత్రం ఆరు గంటలకు పోర్టు సౌజన్యంతో ప్రముఖ గాయకులు ఫణిభూషణ్ ప్రత్యేక గీతాలాపన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భూషణ్‌బ్రదర్స్ కార్యదర్శి డి.భూపతి, ఎంవీఆర్ నాగేశ్వరరావు, నాటక కళాపరిషత్ నాంచారయ్య, వెంకట్, కృష్ణంరాజు, ఫణిభూషణ తదితరులు పాల్గొన్నారు.

బిల్డింగ్ సొసైటీ స్థలంలో పనుల నిలిపివేత

» తదుపరి ఆదేశాల వరకూ పనులన్నీ చేయొద్దు

» జాయింట్ కలెక్టర్ మయూర అశోక్

భీమునిపట్నం, జూలై 17 : బీచ్ రోడ్‌లో వున్న ది భీమునిపట్నం మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ స్థలంలో జరుగుతున్న పనులన్నీ తక్షణమే నిలిపివేయాలని జాయింట్ కలెక్టర్ మయూర అశోక్ ఆదేశించారు. బుధవారం ఆయన రెవెన్యూ, జీవీఎంసీ అధికారులతో కలిసి ఆ స్థలాన్ని పరిశీలించారు. స్థలంలో కొంతకాలంగా ఎర్రమట్టి దిబ్బలను చదును చేసి లేఅవుట్ వేస్తున్న పనులను పరిశీలించారు. ఆ స్థలంలో ఎర్రమట్టి దిబ్బలను ధ్వంసం చేసి చదును చేస్తున్న విషయాన్ని గమనించారు. వీటికి ఎవరు అనుమతులు ఇచ్చారని అధికారులను ప్రశ్నించగా ఎవరూ స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థలంలో జరుగుతున్న పనులన్నీ నిలిపివేయాలని ఆదేశించామన్నారు. దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయం సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించిందని, తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ సొసైటీ స్థలంలో ఏవిధమైన పనులు చేయరాదని చెప్పారు. దీనిపై రెవెన్యూ, జీవీఎంసీ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తుంటారని తెలిపారు. జేసీతో పాటు భీమిలి ఇన్‌చార్జి ఆర్డీవో హుస్సేన్, తహసీల్దార్ గోవింద, జీవీఎంసీ భీమిలి జోనల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, జనసేన నాయకుడు గుడివాడ కిరణ్, బీసీ నేత భాగం గోపాలరావు ఉన్నారు.

రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దాలి: కాంగ్రెస్

మాధవధార, జులై 17 : ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి శ్రమిస్తున్న ముఖ్యమంత్రి నారా.చంద్రబాబు నాయుడు ప్రతి నిర్ణయం రాష్ట్ర భవిష్యత్తుకి ఉపకరించేలా తీసుకోవాలని కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూల.వెంకటరావు సూచించారు. ప్రయోగాలకు ఇది సమయం కాదని అన్నారు. మంత్రి వర్గంలో ప్రస్తుతం యువత, సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యం కల్పించడంతో కొంతమేర సమర్థత మరుగున పడిందన్నారు. పాలనానుభవం ఉన్న వారిని మంత్రి వర్గంలో మేలు చేకూరుతుందని వెంకటరావు అభి ప్రాయపడ్డారు.

పారా అథ్లెటిక్స్‌లో ఆంధ్రాకు పతకాల పంట



పతకాలు సాధించిన క్రీడాకారులు

విశాఖపట్నం (స్పోర్ట్స్), జూలై 17: జాతీయ సబ్ జూనియర్, జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మీట్‌లో ఆంధ్ర అథ్లెట్లు తొలిరోజు పతకాల పంట పండించారు. బెంగళూరులో జరుగుతున్న ఈ టోర్నీలో అద్భుతంగా రాణించి 18 పతకాలు సొంతం చేసుకున్నారు. వీటిలో ఐదు స్వర్ణ, ఐదు రజత, ఎనిమిది కాంస్య పతకాలున్నట్టు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి వి.రామస్వామి తెలిపారు. షాట్‌పుట్‌లో బొర్రా అక్షయ అనురాధ, హెచ్‌యు. శివాని స్వర్ణ పతకాలు, మల్లెల సుదర్శన రజతం, డి.శ్రావణి రజతం, పంగి కరుణాకుమారి కాంస్య పతకం సాధించారు. 1500మీ. పరుగులో మందసాయి నిఖిల్ గౌతమి , కనక సునీల్ కాంస్య పతకాలు, జావెలిన్ త్రోలో సవర శంకరావు కాంస్యం సాధించారు. 100మీ. పరుగులో వి. రవన్ని, కొర్రా రవి స్వర్ణ పతకాలు, కె.తేజశ్రీ, బి. లక్ష్మణ రజత పతకాలు, ఎం.రోహిత్, ఎస్.పూర్ణ చంద్రరావు, జి.సూర్య రోహిత్ కాంస్య పతకాలు సాధించారు. ఈ అథ్లెట్లను అసోసియేషన్ రా ష్ట్ర అధ్యక్షుడు గొనుగుంట్ల కోటేశ్వరరావు, ఇతర ప్రతినిధులు అభినందించారు.

లలితాపీఠంలో భగవద్గీత పారాయణం



భగవద్గీత పఠనంలో మహిళలు

అక్కయ్యపాలెం, జూలై 17: ఆషాఢంలో తొలి ఏకాదశి సందర్భంగా లలితాపీఠంలో అమ్మవారికి బుధవారం సామూహిక భగవద్గీత పారాయణ జరిగింది. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి పూజలు చేయడంతో పాటు భగవద్గీత పఠించారు.

పార్కులపై పెద్దల కన్ను

... 5వ పేజీ తరువాయి

మొక్కలతో కళకళలాడాల్సిన పార్కులలో సిమెంట్ నిర్మాణాలు చేపట్టి, నివాసానికి అనుగుణంగా ఇళ్లు కూడా నిర్మించారు. తాజాగా ఒక పార్కులో శివాలయం నిర్మించి పూజాదికాలు నిర్వహిస్తున్నారు.

ఇదిలావుండగా ఆ పార్కు భూములపై ఇప్పుడు 'యుఎల్‌సీ దళారి' కన్ను పడింది. రెండు పార్కులు కలిపి రెండు వేల చదరపు గజాల విస్తీర్ణంలో ఉంటాయి. బీచ్ రోడ్డును ఆనుకొనే ఉండడం, అంతా పోష్ ఏరియా కావడంతో అవి జమీందార్ల మిగులు భూములని క్లెయిన్ చేసి కొట్టేయడానికి పావులు కదుపుతున్నారు. అందులో భాగంగా సాయిబాబా ఆలయ కమిటీ నుంచి ఆ పార్కులకు, తమకు ఏ సంబంధం లేదని ఒక లేఖ కూడా తీసుకున్నారు. జీవీఎంసీ అధికారులను మేనేజ్ చేసి ఆ భూములను స్వాధీనం చేసుకోవాలని యత్నిస్తున్నారు. ఆ రెండు పార్కుల ముందు అవి జీవీఎంసీకి చెందినవని పెద్ద పెద్ద బోర్డులు ఉన్నా వెనక్కి తగ్గకుండా ప్రయత్నించడం గమనార్హం. ఆ లేఅవుట్‌కు అనుమతి లేనందున అందులో ఖాళీ స్థలాలు జీవీఎంసీకి దఖలుపడవని, అలాంటివి జమీందార్లకే చెందుతాయనే వాదనతో దస్త్రాలు తయారు చేస్తున్నట్టు తెలిసింది.దసపల్లా భూములను ఎలాగూ కాపాడుకోలేకపోయారు. కనీసం పార్కులనైనాఆ దళారి నుంచి కాపాడాల్సిన అవసరం ఉంది.

మళ్లీ టోల్‌గేట్!?

... 5వ పేజీ తరువాయి

రూ.2,155, జిల్లా స్థాయిలో రిజిస్టర్ అయిన కమర్షియల్ వాహనాలకు రూ.30 చొప్పున నిర్ణయించారు. అలాగే, లైట్ కమర్షియల్ వెహికల్, లైట్ గూడ్స్ వెహికల్, మినీ బస్సులకు ఒక ట్రిప్‌నకు రూ.105, రెండువైపులా అయితే రూ.155, నెలకు 50సార్లు ప్రయాణించేందుకు రూ.3,485, జిల్లా స్థాయిలో రిజిస్టర్ అయిన వాహనాలకు రూ.50 ఫీజుగా నిర్ణయించారు. అదేవిధంగా బస్సు, ట్రక్ వంటి వాహనాలు ఒక ట్రిప్‌నకు రూ.220, రిటర్న్ ట్రిప్‌నకు రూ.330, నెలకు 50సార్లు తిరిగేందుకు రూ.7,300, జిల్లా పరిధిలోని రిజిస్టర్ అయిన వాటికి రూ.110గా, కమర్షియల్ వాహనాలు (మూడు చక్రాలు) ఒక ట్రిప్‌నకు రూ.240, రిటర్న్ ట్రిప్‌కు రూ.360, నెలకు 50సార్లు ప్రయాణాలు సాగించేందుకు రూ.7,965, జిల్లా స్థాయిలో రిజిస్టర్ అయిన వాటికి రూ.120 చొప్పున వసూలు చేయనున్నారు. హెవీ కనస్ట్రక్షన్ మెషీన్లతో కూడిన వాహనాలతోపాటు ఇతర వాహనాలకు కొన్నిరకాల చార్జీలను నిర్ధారించి వసూలు చేసేలా టెండర్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. టెండర్లు వేసేందుకు ఈ నెల 24వ తేదీ ఉదయం 11 గంటలు తుదిగడువుగా పేర్కొంది. ఈ నెల 25వ తేదీ ఉదయం 11.30 గంటలకు టెండర్లు తెరవనున్నారు.

సీఎం దృష్టికి తీసుకువెళ్లిన నేషనల్ హైవే అధికారులు

అగనంపూడి టోల్‌గేట్ వ్యవహారాన్ని నేషనల్ హైవే అథారిటీ అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ టోల్‌గేట్ ద్వారా వచ్చే ఆదాయాన్ని రానున్న కాలంలో ఫ్లై ఓవర్లు, బస్, లారీ బేల నిర్మాణం, రోడ్డు మరమ్మతులు, నిర్వహణకు వినియోగిస్తామని చెప్పినట్టు తెలిసింది. అయితే, ఈ విషయంపై సీఎం ఎలా స్పందించారన్నది తెలియాల్సి ఉంది. ఇదిలావుండగా టోల్‌గేట్‌కు అధికారులు టెండర్లు ఆహ్వానించడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. దీనిపై మళ్లీ పోరాటం చేసేందుకు సిద్ధమని పేర్కొంటున్నారు.

దీనిపై స్థానిక ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ నేషనల్ హైవే అథారిటీ అధికారులు ఈ ప్రకటన చేయడం దారుణమన్నారు. ఇక్కడ టోల్‌గేట్ ఏర్పాటుచేస్తే ప్రజాగ్రహానికి గురికావాల్సి ఉంటుందన్నారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని టోల్‌గేట్ ఏర్పాటుపై అధికారులు పునరాలోచన చేయాలన్నారు. ఎన్‌హెచ్16కు బదులు ఎన్‌హెచ్ 5 అంటూ పేర్కొనడం ప్రజలను మోసం చేయడమేనన్నారు.

నేరాల నియంత్రణకు టెక్నాలజీ వినియోగం

... 5వ పేజీ తరువాయి

కల్పిస్తామన్నారు. నేరాల నియంత్రణకు 2014లో రాష్ట్రంలోనే తొలిసారిగా తిరుపతిలో కమాండ్ కంట్రోల్ ఏర్పాటుచేశామన్నారు. తిరుపతి ఎస్పీగా ఉన్నప్పుడు మహిళలు, బాలికలపై దాడులు, వేధింపుల నివారణకు 'షీ' టీమ్స్ ఏర్పాటుచేసిన విషయాన్ని గుర్తుచేశారు. మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామని డీఐజీ వెల్లడించారు. గంజాయి నిర్మూలనకు తగు చర్యలు తీసుకుంటామని, ప్రధానంగా పొరుగునున్న ఒడిశా పోలీసులతో కలిసి ప్రణాళిక అమలు చేస్తామన్నారు. గంజాయి, మత్తు పదార్థాల రవాణా నియంత్రణపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. గంజాయి సాగును నిరోధించేందుకు అన్నిరకాల సాయం అందించనున్నదని పేర్కొన్నారు. గతంలో మూడున్నరేళ్లు విశాఖ జిల్లాలో పనిచేయడంతో ఏజెన్సీలోని అన్ని ప్రాంతాలపై అవగాహన ఉందని...గంజాయి సాగు, రవాణా నియంత్రణపై కఠినంగా ఉంటామన్నారు. గతంలో మావోయిస్టుల కార్యకలాపాలు అణిచివేతకు పలు విభాగాలు ఏర్పాటుచేసి పెద్ద ఎత్తున కూంబింగ్, దాడులు చేసిన మాదిరిగా...ఇప్పుడు గంజాయి నిర్మూలనకు విభాగాలు ఏర్పాటుచేయాలన్నారు. ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటానని గోపినాథ్ జట్టి తెలిపారు. కాగా బాధ్యతలు స్వీకరించిన డీఐజీని సిటీ జాయింట్ సీపీ ఫకీరప్ప, అనకాపల్లి ఎస్పీ దీపికా పాటిల్, ఇతర అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు.

విశాఖ నుంచి ఉద్యోగ జీవితం ప్రారంభం

2008 బ్యాచ్‌కు చెందిన గోపినాథ్ జట్టి ఐపీఎస్ శిక్షణ పూర్తిచేసుకున్న తరువాత 2010లో విశాఖ జిల్లాలో ట్రైనీగా చేరారు. శిక్షణ తరువాత విశాఖలోనే గ్రేహౌండ్స్ అసిస్టెంట్ కమాండెంట్‌గా, తరువాత చింతపల్లి ఏఎస్పీగా పనిచేశారు. మొత్తం మూడున్నరేళ్లు విశాఖ జిల్లాలో పనిచేసి, 2013లో గుంటూరు ఏఎస్పీగా బదిలీపై వెళ్లి...అక్కడే ఎస్పీగా పదోన్నతి పొందారు. రాష్ట్ర విభజన అనంతరం తిరుపతి ఎస్పీగా, ఆ తరువాత మంగళగిరిలో ఆరో బెటాలియన్ కమాండెంట్‌గా, కర్నూలు ఎస్పీగా పనిచేసి 2018లో టీటీడీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా నియమితులై మూడున్నరేళ్లు పనిచేశారు. 2022లో పదోన్నతి రావడంతో గ్రేహండ్స్ డీఐజీగా పోస్టింగ్ పొందారు.

ఆ తవ్వకాలకు వైసీపీ దన్ను?

... 5వ పేజీ తరువాయి

నేరెళ్లవలస వీఆర్‌ఓకు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు ఆర్‌డీఓ ద్వారా నోటీసు ఇప్పించారు. తవ్వకాలపై నిర్లక్ష్యం వహించినట్టు తేలడంతో తోటవీధి సచివాలయం ప్లానింగ్ సెక్రటరీని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

అనుమతి లేకుండా షూటింగ్?

జాయింట్ కలెక్టర్ పర్యటనలో సర్వే నంబరు 96లో ప్రభుత్వ భూమి ఉండగా అక్కడ కూడా తవ్వకాలు జరిపి తాటి దుంగలతో ఓ నిర్మాణం చేపట్టిన విషయం గుర్తించారు. అక్కడ ఏదో సినిమా షూటింగ్ జరుగుతున్నట్టు తెలుసుకున్నారు. ఆ నిర్మాణాన్ని కూలగొట్టి తాటిదుంగలు భద్రపరిచారు. ప్రభుత్వం నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు ఇరవై నాలుగు గంటలూ అక్కడ కాపలా ఉంచాలని, సొసైటీ తవ్వకాలు జరపకుండా చూడాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఇదిలావుండగా దీనిపై వీఎంఆర్‌డీఏ అధికారులు దీనిపై స్పందిస్తూ 2019లోనే లేఅవుట్లకు అనుమతులు ఇచ్చే అధికారం జీవీఎంసీకి ప్రభుత్వం అప్పగించిందని, ఈ సొసైటీ పనులతో వీఎంఆర్‌డీఏకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.



శాకంబరి అలంకరణలో సుత్తమ్మ తల్లి

భీమునిపట్నం (రూరల్), జూలై 17 : మండలంలోని చిప్పాడ గ్రామంలో ఉన్న సుత్తమ్మ తల్లి అమ్మవారికి భక్తులు బుధవారం ప్రత్యేక అలంకరణ చేశారు. ఆషాఢ మాసం తొలి ఏకాదశి సందర్భంగా అమ్మవారిని కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. దేవస్థానం కమిటీ, భవానీ పీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఈ అలంకరణ చేపట్టారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కొమ్మాది, జూలై 17 : కొమ్మాది విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని బక్కన్నపాలెం 11 కేవీ శంబువానిపాలెం ఫీడర్ మరమ్మతు పనుల వల్ల గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ నరేష్ తెలిపారు. బక్కన్నపాలెం, ఎన్‌టీఆర్ కాలనీ, లచ్చిరాజు లేఅవుట్, రైల్వే లేఅవుట్, పోలీస్ బెటాలియన్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

రేపు విమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో...

ఆరిలోవ : విమ్స్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఇందిరానగర్ 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్‌త్రీ ఆపరేషన్ విభాగం ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందిరానగర్, రాజీవ్‌నగర్. ఆదర్శనగర్, సుందర్‌నగర్, రవీంద్రనగర్ ప్రాంతాలకు ఆరోజు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించాలని కోరారు.

తాటితూరు, దాకమర్రిలో ..

భీమునిపట్నం (రూరల్) : మండలంలోని తాటితూరు, దాకమర్రి ఫీడర్ల పరిధిలో మరమ్మతు పనుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఆ రోజు కృష్ణంరాజుపేట, నారాయణరాజుపేట,లక్ష్మీపురం, మజ్జివలస పంచాయతీలకు విద్యుత్ ఉండదన్నారు.

జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్ నిలుపుదలపై హర్షం

పద్మనాభం (రూరల్), జూలై 17 : జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిలుపుదల చేయడం పట్ల ఉపాధ్యాయ సంఘాల జిల్లా ప్రతినిధులు బోని సూర్యనారాయణ, ఉప్పాడ రాము హర్షం వ్యక్తం చేశారు. బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 12న జీపీఎస్‌పై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని తామంతా తీవ్రంగా వ్యతిరేకించామని, ప్రభుత్వం తమ డిమాండ్లను అర్థం చేసుకొని గెజిట్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు ప్రకటించిందన్నారు.

'నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి'

ఎంవీపీ కాలనీ, జూలై 17 : అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల కళాశాలలు నిబంధనలు పాటించడం లేదని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆరోపించారు. ఎంవీపీ కాలనీలోని ఫిట్‌జీ కళాశాల మొహర్రం సెలవు ఇవ్వకుండా తరగతులు నిర్వహిస్తున్నట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ నాయకులు (ఏఐఎస్ఎఫ్) కళాశాల వద్దకు చేరుకుని విద్యార్థులను ఇళ్లకు పంపించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీ ఫీజులు వసూలు చేయడం, సెలవులు లేకుండా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులపై విపరీతమైన ఒత్తిడికి కారణమవుతున్నారని తెలిపారు. సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **భారతీయుడు-2 :** జగదాంబ, శారద, మెలోడి, రమాదేవి, సంగం, వెంకటేశ్వర-1, కిన్నెర, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక) శ్రీకన్య సినీపోలీస్ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి),

● **కల్కి :** శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య, గణేష్, సప్తగిరి (తగరపువలస)

● **సారంగదరియా :** శ్రీవెంకటేశ్వర, శ్రీ నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 67, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 18, పచ్చిమిర్చి 68, కాకరకాయలు 42, బీరకాయలు 30, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 42, క్యాబేజ్ 30, క్యారెట్ 30, దొండకాయలు 30, బంగాళా దుంపలు 32, అరటి కాయ (పె)6, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది) 140, బరబటి 32, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 50, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 94, పొటల్స్ 40, కీరదోస 26, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడ దుంపలు 36, కంద 62, దేవ్, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	92
ఫారం ధర	--	112
విత్ స్కిన్	--	194
స్కిన్‌లెస్	--	204

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



సింహగిరి మాడవీధుల్లో అప్పన్న తిరువీధి ఉత్సవం



ఎంఎంటీసీ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు (ఇన్‌సెట్లో) స్వామివారు

ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు

- తెల్లవారుజాము నుంచే బారులు తీరిన భక్తులు
- మార్మోగిన వెంకన్న నామస్మరణ

సింహాచలం, జూలై 17 : తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లోని పలు ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సింహాచలం దేవస్థానం అనుబంధ ఆలయంగా కొండదిగువ పూదోటలో ఉన్న పద్మావతి, అలిమేలుమంగా సమేత వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు, బాల భోగనివేదనలు జరిపి భక్తులకు దర్శనాలు కల్పించారు.అనంతరం ఉత్సవమూర్తిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై ఉంచి అష్టోత్తర శతనామార్చన చేశారు. తరువాత ప్రత్యేక రుసుం చెల్లించిన భక్తుల గోత్రనామాలతో వేంకటేశ్వరస్వామికి సహస్రనామార్చన జరిపారు.

వైభవంగా అప్పన్న తిరువీధి

ఏకాదశి పురస్కరించుకుని సాయంత్రం సింహగిరిపై వరాహలక్ష్మీనృసింహస్వామి తిరువీధి ఉత్సవం వైభవంగా సాగింది. మధ్యాహ్నం పవళింపు సేవ తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక అలంకరణ చేసి పల్లకిలో అధిష్ఠింపజేశారు. షోడశోపచారాలు సమర్పించారు. ఆలయ విద్వాంసుల మంగళ వాయిద్యాలు, పండితులు, అధ్యాపకుల వేద, పురాణాల పారాయణల పఠనం, భక్తుల గోవింద నామ స్మరణ నడుమ మాడవీధుల్లో స్వామివారి తిరువీధి ఉత్సవం సాగింది. మార్గం పొడవునా భక్తులు స్వామివారికి నారికేళ, కదళీఫలాలు, కర్పూర నీరాజనాలిచ్చి స్వాగతించారు.

సాగర్‌నగర్ : రుషికొండలో ఉన్న శ్రీమహాలక్ష్మి గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులు ఆలయ ఆవరణలో సామూహిక సహస్రనామ విష్ణు పారాయణం చేపట్టారు.



పద్మనాభంలో కుంతీమాధవస్వామికి పూజలు

ఆరిలోవ : చినగదిలిలోని కల్యాణ వేంకటేశ్వర స్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. స్వామివారికి అత్యంత ప్రీతికరమైన తులసి మాలలు వేసి పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేపట్టారు.

కొమ్మాది : అన్నంరాజునగర్‌లోని అష్టలక్ష్మీ దేవాలయానికి భక్తులు పోటెత్తారు. తొలి ఏకాదశి కావడంతో వేకువజామునే అర్చకులు స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ నిర్వహించి, తులసి మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఏడాదిలో వచ్చే 24 ఏకాదశుల్లో ఆషాఢంలో వచ్చే మొదటి ఏకాదశి నుంచి విష్ణుమూర్తి యోగ నిద్రలో ఉంటారని, దీన్నే చాతుర్మాస వ్రత దీక్ష అంటారని ఆలయ ప్రధాన అర్చకుడు చామర్తి శ్రీధర స్వామి భక్తులకు వివరించారు.

వెంకోజీపాలెం : ఎంఎంటీసీ త్రిమూర్తిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు తులసీ దళాలతో భక్తులకు దర్శనమిచ్చారు.స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అర్చకుడు వెంకటాచార్యులు భక్తుల గోత్ర నామాలతో పూజలు, అభిషేకాలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి ఎం.సావిత్రి, కోశాధికారి టి.సుబ్బారాయుడు, మేనేజరు బి. సన్యాసిరావు పాల్గొన్నారు. అలాగే కొత్త వెంకోజీపాలెంలో వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలోనూ తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు.

ఎంవీపీ కాలనీ : తొలి ఏకాదశి సందర్భంగా వైష్ణవాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరులోని వేంకటేశ్వరస్వామి,ప్రసన్నాంజనేయస్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని తులసి మాలలతో సుందరంగా అలంకరించారు. భక్తుల దర్శనాల అనంతరం ఆలయ ఆవరణలో సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు.

అనంతుని క్షేత్రంలో ...

పద్మనాభం : పద్మనాభంలోని అనంతపద్మనాభుని క్షేత్రంలో విష్ణుమూర్తికి ప్రీతికరమైన తొలి ఏకాదశి (శయన ఏకాదశి) వేడుకలు వైభవంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో వేకువజామునే కుంతీమాధవస్వామి ఆలయంలో అనంత పద్మనాభుడికి, కుంతీమాధవస్వామికి విశేష పూజలు జరిపారు. ఈ సందర్భంగా కుంతీమాధవస్వామి మూలవిరాట్టుకు పంచామృతాలతోనూ, చందనం, విభూతి, పసుపు, కుంకుమలతో అభిషేకం చేశారు. అనంతరం అనంతుని ఉత్సవ విగ్రహాలను, కుంతీమాధవుడ్ని విశేషంగా అలంకరించి అర్చనలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి పూజలు చేసి అనంతరం లక్ష్మీదేవిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు పి. సీతారామాంజనేయస్వామి, పవన్ కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డి. గోపీబాబు, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, ఎర్నాయుడు దంపతులు, మరగడ అప్పారావు, జి. చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

పెదవాల్తేరు : పెదవాల్తేరులోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఏకాదశి పురస్కరించుకుని స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. వేకువజాము నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

పద్మనాభం (రూరల్) : మండలంలోని అనంతవరం ధారకొండపై వెలసిన శ్రీమన్నారాయణేశ్వస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు పూజ జరిపారు. 5 గంటల నుంచి గిరి ప్రదక్షిణ, మెట్ల పూజ అనంతరం స్వామివారికి పంచామృత అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు.

ఇరుకు సందులో యూపీహెచ్‌సీ

- 22వ వార్డులో పట్టణ ఆరోగ్య కేంద్రం దుస్థితి
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం
- సమయ పాలన పాటించని సిబ్బంది



ఆస్పత్రి లోపల విభాగాలు



ఇరుకు వీధిలో ఏర్పాటు చేసిన ఆస్పత్రి

మద్దిలపాలెం, జూలై 17 : సినిమాల్లో షూటింగ్ కోసం ఆసుపత్రి సెట్ వేస్తారు. అలాంటి సెట్టే పీతలవానిపాలెంలో వేశారు. సుమారు 600 అడుగులున్న గదిలో ఫార్మసీ, వైద్యుడు, సిబ్బంది గదులతో పాటు రోగులను చేర్చుకునే వార్డు కూడా ఏర్పాటు చేసేశారు. ఆస్పత్రిలో ఓపీ చూస్తే నెలకు వంద కూడా ఉండదు. జీవీఎంసీ పరిధిలోని 22వ వార్డులో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రం పరిస్థితి ఇది. దాదాపు 30 వేల జనాభా కలిగిన ఈ వార్డులో ప్రజలకు వైద్య సేవలందించడానికి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ మంజూరైంది. దీన్ని గత ప్రభుత్వ హయంలో మారికవలస తరలించేశారు. అప్పటి నుంచి వార్డులో ఆసుపత్రి ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉండేది. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖాధికారులు 22వ వార్డుకు యూపీహెచ్‌సీ మళ్లీ మంజూరు చేశారు. దీన్ని స్థానిక కార్పొరేటర్ సూచనతో పీతలవానిపాలెంలోని ఇరుకు సందులో ఏర్పాటు చేశారు. చిన్న ఇంటిని అద్దెకు తీసుకుని అందులో ఆసుపత్రిని తలపించే సెట్ వేసి చేతులు దులుపుకున్నారు. ఇక్కడ ఆసుపత్రి ఉన్నట్టు కూడా ఎవరికీ తెలియదు. కనీసం రోజుకు ఓపీ పది కూడా నమోదు కావడం లేదు.రోగులు లేకపోవడంతో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు ఉండాల్సిన వైద్య సిబ్బంది ఉదయం 10.30 తర్వాత ఆస్పత్రిని తెరిచి మధ్యాహ్నం 2 గంటలకే మూసేస్తున్నారు. రేసపువానిపాలెం వైద్యుడ్ని ఇక్కడ ఇన్‌చార్జ్‌గా వేశారు. రోగులు వచ్చారని ఏఎన్ఎం ఫోన్ చేస్తే ఆయన వచ్చి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అంతవరకు రోగులు ఎదురు చూడాల్సిందే. సమయం వరకు ఆసుపత్రి నిర్వహించడం లేదని డీఎంహెచ్‌వోకి ఫిర్యాదులు వెళ్లడంతో ఈనెల 13న ఆయనే స్వయంగా వచ్చి తనిఖీ చేశారు.

రోగులకు అందని సేవలు

వార్డులో అన్నీ ప్రాంతాలకు పిఠాపురం కాలనీ సెంటర్‌గా ఉంది. విశాలమైన రోడ్డే కాకుండా కళాభారతి పక్కన జీవీఎంసీ భవన సముదాయం ఉంది. గతంలో ఇక్కడే ఆస్పత్రి నిర్వహించేవారు. పిఠాపురం కాలనీ సెంటర్ వదిలి సందులో ఎందుకు ఆస్పత్రి ఏర్పాటు చేశారో స్థానికులకు అంతుపట్టడం లేదు. తారా మసీదు, శివాజీపాలెం, మంగాపురంకాలనీ, బలరాంనగర్, రాజీవ్‌నగర్ వంటి మాస్ ప్రాంతాల ప్రజలకు కళాభారతి రోడ్డు అందుబాటులో ఉంటుంది. ఎమర్జెన్సీ అయితే ప్రథమ చికిత్స అందించడానికైనా ఆటోలో రోగిని పిఠాపురం కాలనీ తీసుకొచ్చే సౌలభ్యం ఉంది. ఇక్కడ కాకుండా పెద్ద రోడ్డు సదుపాయాలున్న ప్రాంతాలుండగా ఎవరికీ తెలియని సందులో ఎందుకు ఆసుపత్రి ఏర్పాటు చేశారో ఆరోగ్యశాఖాధికారులు, స్థానిక కార్పొరేటర్‌కే తెలియాలి. యూపీహెచ్‌సీ ఆరోగ్యశాఖకు ఆర్థిక భారమే తప్ప రోగులకు ఎటువంటి ఉపయోగం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

అయోధ్య సెట్‌తో వినాయక చవితి ఉత్సవాలు

ఎంవీపీ కాలనీ, జూలై 17 : విశాఖలో అయోధ్య రామ మందిరం సెట్‌తో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు యూత్ ఐకాన్ అధినేత రాజు తెలిపారు. ఎంవీపీ కాలనీ అప్పుఘర్ సమీపంలోని విష్ణుకుమార్ రాజు గ్రౌండ్స్‌లో బుధవారం ఉత్సవాలకు సంబంధించి రాట వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వినాయక విగ్రహంతో పాటు బాలగణపతిని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అయోధ్య రామ మందిర నిర్మాణంలో వినియోగించిన రాళ్ల వ్యర్థాలతో ఈ బొమ్మను తయారు చేయించినట్టు తెలిపారు. 21 రోజులపాటు ఉత్సవాలు నిర్వహించిన అనంతరం ఏదైనా ఊరికి ఈ విగ్రహాన్ని వితరణగా అందిస్తామన్నారు. రామ మందిరం సెట్‌లో రాముడి చరిత్రను తెలియజేసే పెయింటింగ్స్‌లు ఉంటాయని, సెట్ వంద అడుగుల వెడల్పు, 60 అడుగుల ఎత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం, కార్పొరేటరు గొలగాని మంగవేణి, పోతన్నరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవానికి రాట వేస్తున్న రాజు, పట్టాభిరామ్, తదితరులు

అర్హత లేని వారికి అకౌంట్స్ బాధ్యత

వెంకోజీపాలెం, జూలై 17 : ఏయూ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ కార్యాలయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఫైల్స్, స్కానర్, ఏసీలు, కంప్యూటర్, తదితర సామగ్రి కాలిపోవడం విడ్డూరంగా ఉందని ఏయూ పరిరక్షణ సమితి సభ్యులు పేర్కొన్నారు. బుధవారం వారు సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అడ్డగోలు రీసెర్చ్ అడ్మిషన్లు జరిగినట్టు తెలిసిందని, దీనికి కారణమైన టీడీఆర్ హబ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రీ పీహెచ్‌డీ ఎగ్జామ్ కూడా కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్, కాన్ఫిడెన్షియల్ సెక్షన్‌కు తెలియకుండా హబ్ ద్వారా నిర్వహించటానికి సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రధాన కారణమని ఆరోపించారు. ఈ క్రమంలోనే కళాశాల అకౌంట్స్ కూడా మారాయని చెప్పారు. సైన్స్ కళాశాలలో ఫైల్స్ తగలబెట్టారా ? లేదా నిజంగానే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల దగ్ధమయ్యాయా అన్నది తేలాల్సి ఉందన్నారు. దీనిపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం. సురేష్‌మీనన్, డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్, డాక్టర్ దాస్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న పరిరక్షణ సమితి సభ్యులు

అప్పన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

సింహాచలం, జూలై 17 : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. బుధవారం తెల్లవారుజామున సుప్రభాత సేవ నుంచి ప్రారంభమైన రద్దీ రాత్రి ఆరాధన వరకు కొనసాగింది. పది గంటల వరకు ఉచిత క్యూ ఖాళీగా ఉండగా అతి శ్రీఘ్రదర్శనం (రూ.300లు) క్యూ భక్తులతో కిక్కిరిసిపోయింది. కేశఖండన శాల, గంగధార వద్ద, ప్రసాదాల విక్రయ కేంద్రాల వద్ద కూడా రద్దీ కనిపించింది ఏకాదశి కావడం, మొహరం సెలవు కావడంతో రద్దీ నెలకొంది. కాగా బుధవారం ఒక్కరోజే ఆర్జిత సేవలు, దర్శనాలు, ప్రసాదాల విక్రయాలు, విరాళాలు ద్వారా రూ.22.31 లక్షల ఆదాయం సమకూరగా దర్శనాల టికెట్ల ద్వారా రూ.10.8 లక్షలు లభించింది.

భీమిలిలో ఘనంగా జగన్నాథుడి మారు రథయాత్ర

భీమునిపట్నం, జూలై 17 : పట్టణంలో జగన్నాథస్వామి మారు రథయాత్ర బుధవారం ఘనంగా జరిగింది. ఈనెల 6 నుంచి ప్రారంభమైన రథోత్సవాల్లో భాగంగా ఇంద్రజ్యుమ్న మందిరంలో స్వామివారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చివరిరోజు శేషశయుని అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు రొంపిచర్ల లక్ష్మీనరసింహ ప్రసాదాచార్యులు వేకువజామున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. సాయంత్రం ఏకాదశి పూజలు జరిపి జగన్నాథస్వామి, సుభద్ర, బలభద్రుని ఉత్సవ మూర్తులను రథంపై పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు రొంపిచర్ల సింగరాచార్యులు, అర్చకుడు కృష్ణమాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.



మారు రథయాత్రలో పాల్గొన్న భక్తులు

దుర్గాలమ్మ ఆలయంలో పూజలు రేపు

కొమ్మాది, జూలై 17 : చంద్రంపాలెం జాతర గుట్టపై వెలసిన దుర్గాలమ్మ ఆలయంలో ఆషాఢ మాసం రెండో శుక్రవారం సందర్భంగా అమ్మవారిని పలు రకాల కూరగాయలు, పండ్లతో శాకంబరిదేవిగా అలంకరించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు అమ్మవారికి సారె సమర్పిస్తామన్నారు. అలాగే ఈనెల 21న గురుపౌర్ణమి సందర్భంగా ఆలయంలోని సాయినాథుడికి అన్నాభిషేకం ఉంటుందని, అనంతరం మహా అన్నదానం నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, పిళ్లా సూరిబాబు, నాగోతి తాతారావు తెలిపారు.

క్లాప్ డ్రైవర్ల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న క్లాప్ డ్రైవర్లు

కొమ్మాది, జూలై 17 : క్లాప్ కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకుండా పని చేయించుకోవడం దారుణమని సీఐటీయూ మధురవాడ జోన్ ఉపాధ్యక్షుడు డి. అప్పలరాజు అన్నారు. బుధవారం క్లాప్ వర్కర్లు తమకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ 5 నుంచి 8వ వార్డు వరకూ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలకు రూ. 13500 జీతం ఇస్తామని ఆరు నెలల క్రితం నియమించుకున్నారని,అప్పటి నుంచి కార్మికులకు జీతాలు ఇవ్వకుండా చాకిరీ చేయించుకుంటున్నారని విమర్శించారు. కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే పారిశుధ్య కార్మికులు పని చేయడానికి గ్లౌస్‌లు, మాస్కులు, హ్యాండ్ వాష్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా కార్మికుల నిరసన గురించి తెలుసుకున్న జోన్ 2 ఏఎంహెచ్‌ఓ కిషోర్ సంఘటనా స్థలానికి వచ్చి వారితో చర్చించారు. ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి వారం రోజుల్లో జీతాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ,కె. వెంకటరమణ, కె. లక్ష్మీ, వై. రమణ, లక్ష్మీనరసింహ, డి. రాము, కల్యాణ్ పాల్గొన్నారు.

అప్పన్నకు స్వర్ణ తులసీ దళార్చన



సింహాచలం, జూలై 17 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా బుధవారం స్వర్ణ తులసీ దళార్చన వైభవంగా నిర్వహించారు.వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ తులసీ దళాలను తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ చేశారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నృసింహ అష్టోత్తర శతనామవళి పఠిస్తూ ప్రతి నామానికి ఒక్కొక్క స్వర్ణ తులసీ దళంతో అర్చకులు పూజలు చేశారు. తరువాత ఆదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వ హించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి దంపతులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. 2 లక్షలు విరాళం



విరాళం అందిస్తున్న లక్ష్మీ దంపతులు

సింహాచలం, జూలై 17 : వరాహలక్ష్మీనృసింహస్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి ఆనందపురం గ్రామ సర్పంచ్ చందక లక్ష్మీ సూరిబాబు దంపతులు రూ.1,01,116లను, నగరంలోని మహారాణిపేటకు చెందిన వి.సూర్య ఉమా భారతి రూ. లక్షలను విరాళంగా సమర్పించారు. విరాళాన్ని చందక లక్ష్మీ దంపతులు నగదు రూపంలో ఏఈఓ ఆనందకుమార్‌కు, భారతి అన్న విభాగం ఇన్‌చార్జి ఏఈఓ పాలూరి నరసింగరావుకు చెక్ రూపంలో బుధవారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాతల కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయ దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

జీవో నెంబరు 21ను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పడాల గోవింద్

వెంకోజీపాలెం, జూలై 17 : ప్రమాదాల నివారణ పేరుతో ఆటో, లారీ డ్రైవర్లపై అధిక జరిమానా విధించేందుకు కేంద్రం తీసుకువచ్చిన జీవో నెంబరు 21ను తక్షణమే రద్దు చేయాలని, ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ అధికారులు పెడుతున్న అక్రమ కేసులను ఆపాలని ఆటో డ్రైవర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ డిమాండ్ చేశారు. బుధవారం కృష్ణా కళాశాల సమీపంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన ఆటో డ్రైవర్ల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని, డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అద్దూరి శంకర్, ఉపాధ్యక్షుడు లంకా గోవింద్, కోశాధికారి మధురెడ్డి, కమిటీ సభ్యులు అప్పలనాయుడు, శ్రీను, కృష్ణంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డి మీడియాను విమర్శించడం సరికాదు : బీవీ రామ్

సిరిపురం, జూలై 17 : తనపై వచ్చిన ఆరోపణలు నిజమో కాదు నిరూపించుకోవాల్సిన బాధ్యత ఎంపీ విజయసాయిరెడ్డిపై ఉందని తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ అన్నారు. బుధవారం ఆయన జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద విలేకరులతో మాట్లాడారు. విజయసాయిరెడ్డి మీడియాపై అవాకులు చవాకులు మాట్లాడటం మంచిది కాదన్నారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేసే బాధ్యత మీడియాపై ఉందని ఆయన చెప్పారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

ఆరిలోవ, జూలై 17 : జీవీఎంసీ 13వ వార్డు శ్రీకాంత్‌నగర్‌కు సమీపంలో ఉన్న జేఎన్ఎన్‌యూఆర్ఎం బ్లాకులో ఉన్న వినాయకుడి గుడి సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. పాదచారు లు, వాహనదారులు, చిన్న పిల్లలు నిత్యం అటువైపుగా రాక పోకలు చేస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో నని స్థానికులు భయపడుతున్నారు. వైర్లు తొలగించాలని సంబంధిత శాఖాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి వైర్లను తొలగించాలని పలువురు కోరుతున్నారు.